బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు:140

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 236 | శనివారం | 27-07-2024 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## 'చేనేత'లకు ఉపాధి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** చేనేత, పవర్ లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (టిజిసిఓ) పనితీరుపై ముఖ్యమంత్రి శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. ఆగస్టు 15వ తేదీ తర్వాత అన్ని విభాగాల్లో యూనిఫామ్ ప్రోక్యూర్ చేసే వారితో సమావేశం నిర్వహించే ఏర్పాట్లు చేయాలని సిఎం అధికారులకు సూచించారు.

# త్వరలో స్థానికం





- ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయండి
- వారంలోగా ఓటరు జాబితా రూపొందించాలి
- అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రిజర్వేషన్లపై గడువులోగా బిసి కమిషన్ నివేదిక సమర్పించాలి

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభించడానికి ఉన్న ఆటంకాలపై సిఎం ఆరా తీశారు. భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసి) నూతన ఓటర్ల జాబితా రావాల్సి ఉందని అధికారులు సిఎంకు తెలిపారు. అందుకు ఎంత సమయం పడుతుందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఇప్పటికే రెండు రాష్ట్రాలకు ఈసిఐ జాబితా పంపిందని, మనతో పాటు మరో ఆరు రాష్ట్రాలకు మరో వారంలో జాబితాలు పంపిస్తుందన్నారు. జాబితా రాగానే వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వారంలోపే తరువాయి 2లో

## ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం


- అఖిలపక్ష భేటీ తర్వాతే నూతన చట్టం
- శాసనసభలో చర్చ చేసి తుది నిర్ణయం : సిఎం

ప్రజాపక్షం / హైదరాబాద్

ధరణితో తలెత్తుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారానికి మరింత లోతుగా అధ్యయనం చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. భూ సమస్యలు నిత్యం ఎక్కువవుతుండడంతో సమగ్ర చట్టం రూపొందించాల్సి ఉందని సిఎం అన్నారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం ధరణి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఒకప్పుడు గ్రామ స్థాయిలోనే అందుబాటులో ఉండే రికార్డులు చట్టాల మార్పుతో క్రమంగా మండల కేంద్రానికి, తర్వాత జిల్లా కేంద్రానికి, రాష్ట్ర స్థాయికి వెళ్లిపోయాయన్నారు. గతంలో భూ సమస్యల పరిష్కారానికి అప్పీలు చేసుకునే అవకాశం ఉండేదని గుర్తు చేశారు. ధరణితో గ్రామ, మండల స్థాయిలో ఏ సమస్యకు పరిష్కారం లేకుండాపోయిందని, తరువాయి 2లో

## శతాబ్దం తర్వాత పారిస్‌లో ఒలింపిక్స్







వందేళ్ల తర్వాత ఫ్రాన్స్ రాజధాని పారిస్ మరోసారి సమ్మర్ ఒలింపిక్స్‌కు వేదికైంది. శుక్రవారం (జులై 26) అట్టహాసంగా ప్రారంభమైన ఈ క్రీడా సంబరం ఆగస్టు 11 వరకూ కొనసాగుతుంది. 1900, 1924 సంవత్సరాలలో ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చిన పారిస్ ముచ్చటగా మూడోసారి వేదికైంది. ఈసారి ఒలింపిక్స్‌లో 32 క్రీడలకు సంబంధించిన 48 విభాగాల్లో, 329 ఈవెంట్స్‌లో పోటీలు జరుగుతాయి. ప్రపంచ వ్యాప్తంగా 184 దేశాలకు చెందిన సుమారు 10,500 మంది అథ్లెట్లు పతకాల కోసం పోటీపడనున్నారు. భారత్ నుంచి 117 మంది ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయ్యారు. వీరిలో ఎంత మందిని పతకాలు వరిస్తాయో చూడాలి.

## కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం ఎందుకు తగ్గుతోంది?

రాజ్యసభలో సిపిఐ ఎంపి సందోశ్ కుమార్



**న్యూఢిల్లీ :** ప్రస్తుత ప్రభుత్వ హయాంలో బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపు క్రమంగా తగ్గుకుంటూ వస్తోందని సిపిఐ రాజ్యసభ సభ్యులు పి.సందోశ్ కుమార్ అన్నారు. రాజ్యసభలో బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అమృత్ కాల్ అంటున్న వేళ దేశానికి ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ అవసరం అని ఆయన డిమాండ్ చేశారు. జనాభాలో 50 శాతానికి పైగా రైతులు ఉన్నారని, వ్యవసాయ రంగం 46 శాతం ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. కాని రైతుల పరిస్థితి మాత్రం మారడం లేదని, ఈసారి కేంద్ర బడ్జెట్ లో వ్యవసాయానికి కేవలం 3.15 శాతమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్ళుగా వ్యవసాయరంగానికి కేటాయింపులు తగ్గుతూ వస్తున్నాయని, 2019–20లో 5.44 శాతం, 2020–21లో 5.08 శాతం, 2021–22లో 4.26 శాతం, తరువాయి 2లో

## 'ఎల్‌ఆర్‌ఎస్' పరిష్కారానికి ప్రభుత్వం సన్నద్ధం

- జిల్లాల వారీగా ప్రత్యేక టీములు
- వేగవంతంగా పరిష్కరించాలని
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అత్యంత పటిష్టంగా లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్‌ను (ఎల్.ఆర్.ఎస్)ను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టీములను ఏర్పాటు చేసేందుఉ చర్యలు తీసుకుంటుంది. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన అంశాలపై హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి తరువాయి 2లో



## ఎన్‌డిఎస్‌ఎ సూచన మేరకే...

### మేడిగడ్డ వద్ద గేట్లు ఎత్తివేత

- నాశనం చేసినవారే పంపులను ఆన్ చేస్తామనడం విడ్డూరం
- కెటిఆర్ గోబెల్స్ ప్రచారాన్ని జనం నమ్మరు
- ఎల్లంపల్లి నుండి మూడు రోజుల్లోగా లిఫ్ట్ చేస్తాం
- ఎల్లంపల్లి ఎత్తిపోతలపై మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి రెండు మూడు రోజుల్లో ఎత్తిపోతల కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి వద్ద అన్నారం సమీపం నుండి పంపింగ్ మొదలు పెడతామన్నారు. కేంద్రంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) ఆదేశాల మేరకు నడుచుకోవాల్సి ఉన్న క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఖైరతాబాద్ జల సౌధలో శుక్రవారం ఎంఎల్‌సి టి. జీవన్ రెడ్డితో పాటు కరీంనగర్ జిల్లా ఎంఎల్‌ఎలతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి కాళేశ్వరం ప్రాజెక్టు, కుంగిపోయిన పిల్లర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూయించారు. కూలిన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి తెలంగాణ సమాజం నిజాలు తెలుసుకోవాల్సి ఉందని అందుకే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల నిర్వహణ, విద్యుత్ బిల్లుల కోసం ప్రతి ఏటా 15వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే అన్ని ఖర్చులు కలిపి ప్రతీ ఏటా రూ. 25వేల కోట్లు అవసరం అవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మెడిగడ్డ గుండె కాయ అన్నారని, కెసిఆర్ ప్రభుత్వం ఇరిగేషన్ సెక్టార్ ను సర్వనాశనం చేసిందన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ వాళ్ళు కాళేశ్వరంను పిక్నిక్ స్పాట్ చేశారు. కాళేశ్వరం కట్టినప్పుడు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అధికారంలో ఉందని, అది కుంగినప్పుడు కూడా ఏదీ మాట్లాడలేదన్నారు. కాళేశ్వరంను సర్వనాశనం చేసి మళ్ళీ ఇప్పుడు బిఆర్ఎస్ దొంగనాటకాలు ఆడుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎన్‌డిఎస్‌ఎ సూచనల మేరకు ముందుకు వెళ్తామన్నారు. మేడిగడ్డ బ్యారేజిలో నీళ్లు కిందికి వదలాలని చెప్పింది కాబట్టే తాము గేట్లు ఎత్తి పెట్టామన్నారు. అలా కాదని మేడిగడ్డ వద్ద నీళ్లు స్టోరేజ్ చేస్తే గోదావరి తరువాయి 2లో

## 2వ తేదీ లోపు పంపులు ఆన్‌చేయాలి

### లేదంటే మేమే ప్రారంభిస్తాం : కెటిఆర్

- కాళేశ్వరం ప్రాజెక్టులను సందర్శించిన గులాబీ బృందం



ప్రజాపక్షం/కాళేశ్వరం/మహదేవ్‌పూర్

కామధేనువు, కల్పతరువు లాంటింది కాళేశ్వరం ప్రాజెక్టు అని, వంద కంపోనెట్లలో ఒకటైన మేడిగడ్డలో జరిగిన చిన్న ఘటనను భూతద్దంలో చూపి రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల నోట్లో మట్టి కొడుతున్నదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటనలో భాగంగా శుక్రవారం బిఆర్ఎస్ నేతల బృందంతో కలసి కెటిఆర్ కన్నెపెల్లి లక్ష్మి పంప్‌హౌస్ ను సందర్శించారు. పంపహౌస్ వద్ద పంపింగ్ మోటర్లను, ఫోర్ బే ప్రాంతాలను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎగువలోని గోదావరిలో నీరు లేక రిజర్వాయర్లు ఎడారిగా మారాయని, దిగువన ప్రాణహిత నుండి పదిలక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్మి పంప్‌హౌస్ నుండి నీటిని ఎత్తిపోయకుండా కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కెసిఆర్‌ను అప్రతిష్ట పాలు చేసేందుకే పూనుకుందని దుయ్యబట్టారు. లక్ష్మి పంప్ హౌస్ ద్వారా ప్రతి రోజు 2 టిఎంసిల నీటిని తరలించడం ద్వారా రిజర్వాయర్లు నిండుకుండలా మారుతాయని, కాళేశ్వరం ప్రాజెక్టు నుండి పంట భూములకు సాగునీరు అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఆగస్టు 2న రాష్ట్రంలోని 50 వేల మంది రైతులతో లక్ష్మి పంప్‌హౌస్ ముట్టడించి తరువాయి 2లో

## ప్రధాని 'అగ్నిపథ్' వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు ఫైర్

### మోదీ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ ధ్వజం



**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష పార్టీలు 'అగ్నిపథ్' పథకంపై అనవసరమైన ఆరోపణలు చేస్తున్నాయని కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు నివాళులు అర్పిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ప్రధాని వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఆర్మీ చేపట్టిన అవసరమైన సంస్కరణలకు అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ స్కీమ్ ఒక ఉదాహరణ అని మోదీ అన్నారు. సాయుధ దళాలలో సగటు వయస్సును తక్కువగా ఉంచే లక్ష్యంతో రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీపై విపక్షాలు ధ్వజమెత్తాయి. అగ్నిపథ్ విషయంలో ప్రధాని 'చిల్లర రాజకీయాలు' తరువాయి 8లో

## దుర్మార్గపు కుట్రలు తిప్పికొడతాం

### కార్గిల్ నుంచి పాక్‌కు మోదీ హెచ్చరిక



**లధాఖ్:** దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన సైనికుల త్యాగాలకు యావత్ భారతావని ఎప్పటికీ రుణపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కార్గిల్ 25వ విజయ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం ఆయన లధాఖ్ వెళ్లారు. ద్రాస్‌లోని యుద్ధ స్మారకాన్ని సందర్శించి అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలిస్తామని దాయాది దేశాన్ని మరోసారి గట్టిగా హెచ్చరించారు. 'గతంలో పాకిస్థాన్ పాల్పడిన వికృత ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయినా, చరిత్ర నుంచి ఆ దేశం ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదు సరికదా.. ఉగ్రవాదం, ప్రాక్సీ వార్‌తో ఇంకా మనపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ రోజు నేను మాట్లాడే మాటలు.. ఉగ్రవాదులను తయారుచేస్తున్న వారికి (పాక్ సైన్యాన్ని ఉద్దేశిస్తూ) నేరుగా వినబడతాయి. ముష్కరులను పెంచి పోషిస్తున్న వారికి నేను చెప్పేది ఒక్కటే.. వారి దుర్మార్గపు తరువాయి 8లో




## 'అగ్నిపథ్' రద్దుచేయాలి


### ఎఐవైఎఫ్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత రక్షణ రంగాన్ని ప్రైవేటుపరం చేసే 'అగ్నిపథ్' పథకంను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ దళాలపై సాధించిన విజయాన్ని కాంక్షిస్తూ, భారతదేశ వీర సైనికుల త్యాగాలను స్మరించుకుందాం పేరిట అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) రాష్ట్ర సమితి సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద యుద్ధట్యాంక్ ముందు తరువాయి 2లో

# వెనెజులా ఎన్నికలపై ఉత్కంఠ

## 28న పోలింగ్





**కారకస్ :** వెనెజులా అధ్యక్ష పదవికి ఈనెల 28వ తేదీన జరగబోయే ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, ఆర్థిక వ్యవస్థ క్రమంగా కోలుకొని, మెరుగుపడడం వంటి అంశాలు ప్రస్తుత అధ్యక్షుడు నికొలస్ మదురో మరోసారి ఎన్నికయ్యేందుకు అవకాశాలను మెరుగుపరచనున్నాయి. అధికారంలోకి వస్తామన్న ఎడ్మండో గంజాలెజ్ నేతృత్వంలోని మితవాద ప్రతిపక్ష కూటమికి మరోసారి ఎదురుదెబ్బ తప్పకపోవచ్చని పరిశీలకులు అంటున్నారు. 2020లో కరోనా మహమ్మారి మిగతా దేశాల మాదిరిగానే వెనెజులాపైన కూడా తీవ్ర ప్రభావం చూపింది. దీనికితోడు అమెరికా క్రూరమైన ఆంక్షలు వెనెజులాను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేశాయి. వెనెజులా కమ్యూనిస్టు పార్టీ కూడా భాగస్వామిగా ఉన్న ఆర్‌ఎస్‌ఎల్‌వి సోషలిస్టు కూటమితోపాటు దేశాధ్యక్షుడు మదురో కూడా విమర్శలకు గురయ్యారు. ఇదే అదనుగా మితవాద ప్రతిపక్ష కూటమి సైతం గత పదకొండు సంవత్సరాల్లో, అనేక సందర్భాల్లో విపరీతమైన డిమాండ్లతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసింది. ఫలితంగా 2015–23 మధ్య కాలంలో వెనెజులా పూర్తిగా అస్తవ్యస్తమైన రాజకీయ, ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొంది. అయితే, ఆ తర్వాత మదురో క్రమంగా తన పట్టును తిరిగి సంపాదించారు. ప్రజల్లో నమ్మకాన్ని గెల్చుకుంటున్నారు. ప్రభుత్వ సమయోచిత నిర్ణయాలు, తీసుకున్న చర్యల కారణంగా పరిస్థితులు క్రమంగా మెరుగుపడ్డాయి. ఆర్థిక వ్యవస్థ గట్టెక్కింది. ద్రవ్యోల్బణ రేటు గణనీయంగా తగ్గి, ఈ ఏడాది జూన్ మాసంలో కేవలం 1 శాతానికి చేరింది. ఈ మార్పుల కారణంగా ప్రతిపక్ష కూటమి ప్రజలకు దూరమవుతుండగా, మదురో సర్కారు తన ప్రాబల్యాన్ని తిరిగి సంపాదించింది. నిన్నటిమొన్నటి వరకూ ప్రతిపక్ష అభ్యర్థి గంజాలెజ్‌కు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని స్పష్టం చేసిన విశ్లేషణలు, నివేదికలు ఇప్పుడు మారుతున్న అంచనాల ప్రకారం మదురోకే విజయావకాశాలున్నట్టు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం మీద మరోసారి దేశాధ్యక్షుడిగా మదురో ఎన్నికవుతారా లేక ప్రతిపక్ష కూటమి ఆధిపత్యాన్ని కనబరుస్తుందా అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్.




# సెప్టెంబర్ 21న శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు

## ఇండిపెండెంట్‌గా విక్రమసింఘే పోటీ



**కొలంబో :** శ్రీలంక దేశాధ్యక్ష పదవికి సెప్టెంబరు 21న ఎన్నికలు జరుగుతాయి. శ్రీలంక ఎన్నికల కమిషన్ శుక్రవారంనాడు ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అధ్యక్ష పదవికి పోటీ చేసే అభ్యర్థులు ఆగస్టు 15 నుండి నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చునని కూడా ఎన్నికల సంఘం ప్రకటించింది. రాబోయే ఐదేళ్ళకాలానికిగాను దేశ కొత్త అధ్యక్షుణ్ణి ప్రజలు ఎన్నుకోవలసి ఉంటుంది. ప్రస్తుత దేశ అధ్యక్షుడు రనిల్ విక్రమసింఘే కూడా ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈసారి ఆయన ఇండిపెండెంట్‌గా అధ్యక్ష ఎన్నికల బరిలోకి దిగనున్నారు. దేశాధ్యక్షుడుగా విక్రమసింఘే ఆర్థిక సంక్షోభ పరిష్కారానికి శాయశక్తులా కృషి చేశారు. ద్రవ్యోల్బణాన్ని కూడా గణనీయస్థాయిలో కట్టడి చేయగలిగారు. కాగా మార్క్సిస్టుపార్టీకి చెందిన అనుర కుమార దిస్సనాయకే (జెవిపి పార్టీ), సజిత్ ప్రేమదాస (ఎస్‌జెబి పార్టీ) పోటీలో ఉన్నారు. వీరితోపాటు ఎల్‌టిటి ప్రభాకరన్‌ను మట్టుపెట్టినమాజీ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ శరత్ ఫోన్సెకా (73) కూడా దేశాధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. తాను దేశాధ్యక్షుడైతే దేశంలో అవినీతిని నిర్మూలిస్తానని ఆయన హామీ ఇస్తున్నారు. ర్యాకింగ్ ప్రకారం దేశాధ్యక్ష పదవి ఎన్నిక జరుగుతుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు యాభై శాతంపైగా ఓట్లు రావాల్సి ఉంటుంది. ఇంతకుముందు 2019లో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. శ్రీలంక పోడుజన పెరుమన (ఎస్‌ఎల్‌పిపి) పార్టీ (సింహళీపేరు) ప్రస్తుతం అధికారంలో ఉంది. మాజీ నాయకుడు మహింద రాజపక్షకు విధేయులుగా ఉండే సభ్యులకు నిలయంగా ఉన్న శ్రీలంక పీపుల్స్ ఫ్రీడమ్ ఎలయన్స్‌కు ఎస్‌ఎల్‌పిపి మాతృకగా ఉంది. శ్రీలంక ఫ్రీడమ్ పార్టీ నుండి చీలిపోయి 2016లో ఎల్‌ఎల్‌పిపి ఏర్పడింది. 2019లో రాజపక్ష పాలనలో పన్నుల్లో కోత విధించడం, కరోనా ప్రభావంతో టూరిస్టులు తగ్గిపోవడంతో ఆ దేశం ఆర్థిక సంక్షోభంలో పడింది. అప్పుల ఊబిలో కూరుకున్న ఆ దేశంలో 2022లో చెలరేగిన సంక్షోభం, అల్లర్లు, తదుపరి ప్రధానమంత్రిగా రాజపక్షే రాజీనామా వంటి ఘటనలు ప్రపంచంలో చాలా దేశాలకు గుణపాఠంగా మారాయి. తర్వాత అదే ఏడాది రనిల్ విక్రమసింఘే మే 12న కొత్త ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దేశంలో ఉద్యమం ఉధృతం కావడంతో గొటబయ రాజపక్ష జులై 13న దేశాధ్యక్ష పదవికి రాజీనామా చేసి విక్రమసింఘేను ప్రవాసం నుండే తాత్కాలిక అధ్యక్షుడుగా నియమించారు. తర్వాత ఐఎంఎఫ్‌తో మంతనాలు సాగించి దేశాన్ని గట్టెక్కించేందుకు ఆయన తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

# గాజా ప్రజల కష్టాలపై మౌనంగా ఉండను

## కమలా హారిస్



**వాషింగ్టన్ :** గాజాలో ప్రజలు పడుతున్న కష్టాలు చూస్తూ తాను మౌనంగా ఉండలేనని అమెరికా ఉపాధ్యక్షురాలు, దేశ అధ్యక్ష పదవికి డెమోక్రటిక్‌పార్టీ తరపున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న కమలా హారిస్ అన్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూతో శుక్రవారంనాడు కమలాహారిస్ సమావేశం జరిపారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ యుద్ధం కారణంగా గాజాలో ప్రజలు ఎన్నో కష్టాలు పడుతున్నారని, ఆ కష్టాలు చూస్తూ తాను మౌనంగా ఉండలేనని అన్నారు. ఐతే ఇజ్రాయిల్ మనుగడ, ఇజ్రాయిల్ భద్రత విషయంలో కూడా రాజీ పడేదిలేదని కూడా ఆమె అన్నారు. వందలాదిమంది అమాయకులైన పాలస్తినా ప్రజలు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది నెలలుగా అక్కడ విధ్వంసం జరుగుతోందని ఈ విషయంలో తాను మౌనంగా ఉండబోనని అన్నారు. నేతన్యాహూతో జరిపిన సమావేశంలో, గాజా ప్రజల కష్టాలు తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

**ఖాన్‌యూనిస్‌లో 18 మంది మృతి...**పాలస్తినా నగరం ఖాన్‌యూనిస్‌లో ఇజ్రాయిల్ సైన్యం శుక్రవారం జరిపిన వరుస దాడుల్లో 18 మంది మరణించారు. నుసెరాత్ శరణార్థ శిబిరంలో మరో ఇద్దరు మరణించారు. అంతకుముందు రోజు గురువారం గాజాలో 33 మంది పాలస్తీయన్లు మరణించగా, మరో ఐదుగురు ఇజ్రాయిల్ బందీల మృతదేహాలను ఆ దేశ సైన్యం స్వాధీనం చేసుకున్న కీలకపరిణామం సంభవించింది. వారిని బందీలుగా తీసుకువెళ్ళిన తొమ్మిదినెలల18 రోజుల తర్వాత ఈ ఐదుగురూ విగతజీవులుగా దొరికారు. రవిడ్ కాట్స్ (51), ఓరెన్ గోల్డిన్ (33), మాయా గోరెన్ (56), కిరిల్ బ్రోడ్స్కి (19), తోమర్ యాహోవ్ అహిమాస్ (20)లు గా వీరిని గుర్తించారు. ఖాన్ యూనిస్‌లో గాలింపు చర్యల సందర్భంగా ఈ ఐదు మృతదేహాలను ఐడిఎఫ్ స్వాధీనం చేసుకుంది.

## ఇమ్రాన్‌ఖాన్ విడుదల కోసం ఆందోళనకు పిటిఐ పిలుపు



**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్ దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు చేపట్టాలని ఇమ్రాన్‌ఖాన్ పార్టీ పిటిఐ(పాకిస్థాన్ తెహ్రీక్ ఏఇన్సాఫ్) పిలుపునిచ్చింది. పార్టీ నాయకుడు, మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ సహా దేశవ్యాప్తంగా జైళ్ళల్లో మగ్గుతున్న పిటిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలను విడుదల చేయాలని కోరుతూ దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలకు పిటిఐ పార్టీ పిలుపునిచ్చింది. ఐతే ఇమ్రాన్‌ఖాన్‌పార్టీతో ముఖాముఖీగా తాడోపేడో తేల్చుకోవడానికి అధికారపార్టీ సిద్ధపడుతున్నది. మరోవైపు దేశంలో మతఛాందసవాద జమాతే ఏఇస్లామీ పార్టీ కూడా దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపుఇచ్చింది. దేశంలో రోజురోజుకూ ప్రజాజీవనం దుర్భరంగా మారుతోందనీ, ధరలు ఆకాశాన్ని అంటాయని, బతికేఅవకాశం లేకుండాపోయిందని ప్రభుత్వంపై ఆ పార్టీ విరుచుకుపడింది. దీంతో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం అప్రమత్తమై దేశంలో ప్రదర్శనలు, ఊరేగింపులు నిషేధిస్తూ 144వ సెక్షన్‌ను అమలులోకి తీసుకువచ్చింది. జులై 12న పాకిస్థాన్ సుప్రీంకోర్టు ప్రతిపక్ష పిటిఐ పార్టీకి ప్రతిపక్షంగా పూర్తి అర్హతలు ఉన్నాయని, నిషేధం కూడదని చెప్పిన నేపథ్యంలో పిటిఐ కొత్త జవసత్వాలు పుంజుకుని నిరసన ప్రదర్శనలకు సన్నద్ధమైంది.

## నైజీరియాలో బతుకు దుర్భరం

### ప్రభుత్వ వ్యతిరేక నిరసనలపై ఉక్కుపాదం




**అబూజా :** నైజీరియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరపాలని యువజన సంఘాలు సమాయత్తం కావడంతో అక్కడి ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు సిద్ధపడుతున్నది. దేశంలో ద్రవ్యోల్బణం 34శాతంపైగా పెరిగిపోగా, ఆహార ద్రవ్యోల్బణం 40శాతంపైగా పెరిగిపోయింది. జీవనవ్యయాలు పెరిగిపోయి. జీవితాలు దుర్భరంగా మారిపోవడంతో దేశంలో యువకులు నిరసన ప్రదర్శనలు జరిపేందుకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 1వ తేదీ నుండి నైజీరియా దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిపేందుకు యువజన సంఘాలు సిద్ధం కావడంతో ప్రభుత్వం ప్రతివ్యూహంతో సమాయత్తమైంది. కెన్యా, ఉగాండా దేశాల లో కూడా ఇదేసమస్యలపై ప్రజలు నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు. ఈ తరహా నిరసన ప్రదర్శనలు, అల్లర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని నైజీరియా ప్రభుత్వం యువకులకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఎమర్జెనీ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంది. యువకులు కెన్యా, ఉగాండా తరహాలో దేశంలో నిరసనలు, అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని, అణచివేస్తామని దేశాధ్యక్షుడు బోలా అహ్మద్ అడెకున్లే టినుబు ఒక హెచ్చరిక జారీ చేశారు. దేశంలోఆర్థిక సమస్యలు పరిష్కారం కావడానికి ఇంకా మూడు నాలుగు నెలలు సమయం పడుతుందని ఆయన అన్నారు.

## కాల్పుల విరమణకు నెతన్యాహూపై బైడెన్ ఒత్తిడి

**వాషింగ్టన్ :** అమెరికా పర్యటనలో ఉన్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ శుక్రవారం వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌తో సమావేశం జరిపారు. ఈ సందర్భంగా వారిద్దరు ప్రధానంగా గాజాలో ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ఎదురుగాలి ఎదుర్కొంటున్న బైడెన్ ఇజ్రాయిల్ విషయంలో సానుకూలంగా ఉంటూనే పాలస్తినాపట్ల సానుభూతి ప్రకటించి ఓటర్ల వ్యతిరేకత తగ్గించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. పాలస్తినా ప్రజలకు కష్టాలు తప్పించాలని, వారిని ఆదుకోవాలని అందువల్ల హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాలని జో నేతన్యాహూపై జోబైడెన్ ఒత్తిడి తీసుకువచ్చారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కూడా నేతన్యాహూపట్ల సానుకూలంగా ఉంటూనే పాలస్తినా ప్రజలకు మేలు చేస్తున్నట్లుగా ప్రముఖంగా ప్రచారం వచ్చేందుకు ప్రకటనలు గుప్పిస్తున్నారు. కాల్పుల విరమణ ఒప్పందంతో పాటు ఖైదీలను విడుదల చేయాలని నేతన్యాహూను బైడెన్ కోరారు. కాగా నేతన్యాహూ శుక్రవారం పొద్దుపోయాక రిపబ్లికన్‌పార్టీ అధ్యక్ష అభ్యర్థి, దేశ మాజీఅధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశం జరిపారు.

## గయేమీ తుఫానుతో చైనా అతలాకుతలం

**బీజింగ్ :** గయేమీ తుఫాను చైనాలోని ఫుజియన్ రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నది. తైవాన్, ఫిలిప్పైన్స్‌ను తీవ్రంగా భయపెట్టి బీభత్సం సృష్టించిన గయేమీ తుఫాను ఇప్పుడు చైనాలోని ఫుజియన్ రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నది. చైనా తూర్పు తీర ప్రాంతంలో అత్యంత శక్తిమంతమైన తుఫాను అల్లకల్లోలం సృష్టించడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి. దీంతో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి ఈ భయంకర తుఫాను నుండి రాష్ట్రాన్ని రక్షించేందుకు ముందు జాగ్రత్తలపై చర్చించారు. 3,00,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించారు. గయేమీ తుఫాను కారణంగా ఫిలిప్పైన్స్‌లో 20 మంది మరణించగా తైవాన్‌లో తొమ్మిదిమంది, చైనాలో ఇప్పటి వరకూ ముగ్గురు మరణించారు.

## త్వరలో 'స్థానిక'

(మొదటి పేజీ తరువాయి)

ఆయా స్థానిక సంస్థలకు తగినట్లు ఓటర్ల జాబితాలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. రిజర్వేషన్‌లకు సంబంధించి బిసి కమిషన్ సైతం నిర్దిష్ట గడువులోగా తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనరసింహ, సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి జానా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, వేముల శ్రీనివాసులు, సంగీత సత్యానారాయణ, అజిత్ రెడ్డి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌డిఎస్‌ఎ సూచన మేరకే...

(మొదటి పేజీ తరువాయి)

పరివాక ప్రాంతాలు నీట మునుగుతాయన్నారు. కెటిఆర్ కంటే కూడా ఎన్‌డిఎస్‌ఎకు తెలివి ఎక్కువగా ఉందని అనుకుంటున్నామన్నారు. కాళేశ్వరంను మీరే నాశనం చేసి...మళ్ళీ మీరే పంప్‌లను ఆన్ చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. లక్షలాది కోట్ల రూపాయలతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ మూడో బ్లాక్‌లోని పిల్లర్లు కూలాయన్నారు. గత ఏడాది అక్టోబర్ 21న తాము ఇంకా అధికారంలోకి రాక ముందే కుంగిపోయాయని, దాదాపు 85 గేట్లు, 16 టిఎంసిల కెపాసిటితో ఈ బ్యారేజీని నిర్మించగా.. 19, 20, 21 నెంబర్ పిల్లర్లు కుంగిపోయాయని తెలిపారు. ఇదే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును బిఆర్‌ఎస్ ప్రభుత్వం రిడిజైన్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి ఏకంగా రూ. 94వేల కోట్లు ఖర్చు చేసినా ఈ ప్రాజెక్టు ఎందుకూ పనికి రాకుండా పోయిందన్నారు. దీనిపై స్పందించాల్సిన మాజీ సిఎం కెసిఆర్, ఇరిగేషన్ శాఖ మాజీ మంత్రి హరీష్ రావులు నోరు మెదపడం లేదన్నారు.

### కెటిఆర్ గోబెల్ ప్రచారాన్ని జనం నమ్మరు...

కాగా కెటిఆర్ శుక్రవారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి తమ కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్లోబల్ ప్రచారాలు చేస్తూ విమర్శించడం హాస్యాస్పదమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన తమ ప్రభుత్వంపై ఎంతగ్లోబల్ ప్రచారం చేసినా జనం నమ్మరని, బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.94వేల కోట్లకు పైగా ఖర్చు చేసినా కాళేశ్వరం ఇంకా పూర్తిచేయించలేదని ప్రజలకు తెలుసునన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉండి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి బిఆర్‌ఎస్ ఎంత తక్కువ మాట్లాడితే అంత బెటర్ అని పేర్కొన్నారు.

## ప్రభుత్వం సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాస రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్.ఆర్.ఎస్ విధివిధానాలపై పూర్తి స్థాయిలో కసరత్తు నిర్వహించారు. ఎల్ఆర్ఎస్‌తో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను భట్టి విక్రమార్క సూచించారు. దరఖాస్తులను పరిష్కరించేందుకు 33 జిల్లాల్లో ప్రత్యేకంగా ఒక టీములను ఏర్పాటు చేసుకోవాలని,సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డెప్యుటేషన్ తీసుకోవాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ అనుమతుల కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులు వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కాట అమ్రపాలి, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి విపి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకలు

## పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సిఎస్ శాంతికుమారి ఆదేశాలు

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించారు. డిజిపి జితేందర్, జిఎడి కార్యదర్శి రఘునందన్‌రావు, పోలీసు, విద్యుత్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఆర్‌అండ్‌బి తదితర శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి పరేడ్ గ్రౌండ్ లోని సైనిక అమర వీరుల స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పించి తరువాత గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తారని ఆమె తెలిపారు. వేడుకల సందర్భంగా అసెంబ్లీ, కౌన్సిల్, హైకోర్టు, రాజ్‌భవన్, సెక్రటేరియట్ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత అధికారులను సిఎస్ ఆదేశించారు. జాతీయ పతాకం ఎగురవేసే ప్రధాన వేదిక వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్‌అండ్‌బి శాఖను సిఎస్ కోరారు. వేడుకలు నిర్వహించే పరిసర ప్రాంతాలలో ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పురపాలక శాఖను ఆదేశించారు. అంబులెన్స్, నర్సింగ్ అసిస్టెంట్లను అందుబాటులో ఉంచాలని ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ప్రముఖులకు, అధికారులకు, వేడుకకు హాజరయ్యే వారికి ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను కేటాయించడంతో పాటు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని పోలీసుశాఖకు సూచించారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని ఫైర్ శాఖను, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను సిఎస్ ఆదేశించారు. వెయ్యి మంది కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామని సాంస్కృతిక శాఖ అధికారులు సిఎస్‌కు తెలిపారు. సాంప్రదాయ వస్త్రధారణతో కళాకారుల ప్రదర్శనలు వేదికకు వన్నె తెచ్చేలా ఉంటాయని అధికారులు వివరించారు. వచ్చేనెల 13న ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ జరగనుండగా 10వ తేదీ నుంచి రిహార్సల్స్ ఉంటాయని అధికారులు వివరించారు.

## 2వ తేదీ లోపు పంపులు ఆన్‌చేయాలి (మొదటి పేజీ తరువాయి)

పంపులను తామే ప్రారంభిస్తామని కెటిఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించారు. మాజీ సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై కెటిఆర్ విమర్శల దాడి ఎక్కుపెట్టారు. ఎగువలో 26 టిఎంసిల సామర్థం గల ఎల్‌ఎండిలో 5టిఎసిలు, మిడ్ మానేరులో 28టిఎంసి సామర్థ్యానికిగాను 5టిఎసిలు, శ్రీరాంసాగర్‌లో 90 టిఎంసిల సామర్థ్యానికి గాను 25 టిఎంసిల నీరు తక్కువగా ఉందని, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, అన్నపూర్ణ సాగర్ లో నీరులేక ఎడారిని తలపిస్తున్న రిజర్వాయర్లకు ప్రత్యామ్నాయ మార్గాలు లేక కేవలం లక్ష్మీ పంప్‌హౌస్ ఎత్తిపోతల ద్వారా మాత్రమే నీటిని తరలించి నింపాల్సి ఉండ గా రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను విస్మరించిందని కెటిఆర్ ఆరోపించారు. కాగా, కెటిఆర్ బృందంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జగదీశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లాలోని బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**కాళేశ్వరం ఆలయంలో బిఆర్‌ఎస్ బృందం ప్రత్యేక పూజలు**

కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటనలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం ఆలయాన్ని బిఆర్‌ఎస్ నేతలు దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు కెటిఆర్ బృందానికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కెటిఆర్ బృందం కాళేశ్వర ముక్తీశ్వర స్వామికి, శుభానంద దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రలతో సన్మానించి ఆశీర్వచనం అందించారు. అనంతరం కెటిఆర్ బృందం గోదావరి పుష్కర ఘాట్ తీరాన్ని సందర్శించి గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. గోదారమ్మకు సారె, చీరె సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం కన్నెపెల్లి పంప్ హౌస్ సందర్శించారు.

## శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)



సమస్త అధికారులు జిల్లా కలెక్టర్‌కు అప్పజెప్పారన్నారు. అక్కడ కూడా సమస్య పరిష్కారం కావడంలేదని, కలెక్టర్లు తీసుకునే ఏ నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం లేకుండా ధరణిని రూపొందించారన్నారు. ఈ నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారానికి విస్తృతస్థాయి సంప్రదింపులు చేపట్టాలని, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని ముఖ్యమంత్రి అన్నారు. అలాగే అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలతో సమగ్ర చట్టం తీసుకురావల్సి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. భూదాన్, పోరంబోకు, బంచరాయి, ఇనాం, కాందిశీకుల భూముల సమస్యలున్న ఓ మండలాన్ని ఎంపిక చేసుకుని, అక్కడ ఎదురవుతున్న సమస్యలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందిస్తే ఆ సమస్యలపైనా పూర్తి స్పష్టత ఏర్పడుతుందన్నారు. అవసరమైతే వీటన్నింటిపై శాసనసభలో చర్చ చేసి తుది నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనుసూయ సీతక్క, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ధరణి కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి, సునీల్ కుమార్, రేమండ్ పీటర్, మధుసూదన్, సిసిఎల్‌ఎ నవీన్ మిట్టల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సిఎం ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, కార్యదర్శులు వేముల శ్రీనివాసులు, సంగీత సత్యానారాయణ, అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎందుకు తగ్గుతోంది?

(మొదటి పేజీ తరువాయి)

2022–23లో 3.8 శాతం చొప్పున వ్యవసాయ కేటాయింపుల తగ్గుతూ వస్తున్నాయని విమర్శించారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చారని, ఆయన సిఫార్సు చేసినట్లుగా ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం జోడించి కనీస మద్దతు ప్రకటించినప్పుడే ఆయన కు భారతరత్న కన్నా ఘనమైన నివాళి అవుతుందన్నారు.

**జనగణన ఎప్పుడు :** ఎన్‌డిఎ అంటే నో డాటా అలయెన్స్, ఏ అంశంపై కూడా సమగ్ర సమాచారం ప్రభుత్వం దగ్గర ఉండదని సందోశ్ కుమార్ ఎద్దేశా చేశారు. దేశవ్యాప్తంగా 13 ఏళ్ళ క్రితం జనాభా లెక్కలు సేకరించారని, మరి ప్రధాని మాత్రం 25 శాతం జనాభా దారిద్ర్య రేఖ నుండి ఎగువకు వచ్చారని చెబుతారని, దీనికి ఆధారమేమిటని ప్రశ్నించారు. పార్లమెంటు ఉభయ సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పటికీ, అది అమలయ్యేందుకు నియోజకవర్గాల పునర్విభజన జరగాలని, అది సాధ్యం కావాలంటే జనగణన తక్షణమే చేపట్టాలని అన్నారు.

**దక్షిణాది ప్రజలు ఒంటరి అవుతున్నారు :** కేంద్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలు, కలల పట్ల సర్జికల్ స్ట్రైక్ చేసినట్లుగా ఉందని, దక్షిణాది ప్రజలను ఒంటరి చేసారని భావన వ్యక్తమవుతోందని సందోశ్ కుమార్ అన్నారు. ముఖ్యంగా కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు కేటాయింపుల్లో వివక్ష పట్ల ఆక్షేపణ వ్యక్తం చేశారు. కేంద్ర నిధులకు కేరళ రాష్ట్రం నుంచి ఒక్క శాతం వస్తుంటే, అందులో కనీసం అర శాతం కూడా తిరిగి ఇవ్వడం లేదన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తగ్గించే చర్యలు బడ్జెట్‌లో లేవని విమర్శించారు.

### ఎఐ నియంత్రణకు ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టిన సందోశ్

ఎఐ నియంత్రణకు ప్రైవేటు బిల్లు పెట్టిన సిపిఐ : కృత్రిమ మేధ నియంత్రణ (నైరా)కు ప్రైవేటు మెంబర్స్ బిల్లును శుక్రవారం నాడు రాజ్యసభలో సిపిఐ సభ్యుడు పి.సందోశ్ కుమార్ ప్రవేశపెట్టాడు. కృత్రిమ మేథస్సు వేగంగా విస్తరిస్తోందని, దీంతో లాభాలతో పాటు నష్టాలు కూడా ఉన్నాయన్నారు. ఇందుకు డీప్ ఫేక్‌తో పాటు తప్పుడు సాక్ష్యాలు సృష్టించడం, వ్యవస్థలపై విశ్వాసాన్ని కోల్పోయేలా చేయడటం వంటి ప్రమాదాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే ఎఐ కారణంగా అనేక మంది ఉపాధి కోల్పోయారని ప్రైవేటు బిల్లులో వెల్లడించారు. ఎఐ వినియోగంపై యూరోపియన్ యూనియన్, కెనెడాలో నియంత్రణకు చర్యలు తీసుకున్నారని, మన దేశంలో కూడా ఆ మేరకు చట్టం అవసరమని పేర్కొన్నారు. అందుకు నేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రెగ్యులేటరీ అథారిటీ(నైరా)ను ఏర్పాటు చేయాలని కోరుతూ బిల్లును ప్రతిపాదించారు.

## 'అగ్నిపథ్' రద్దుచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉగ్రవాదం నశించాలి, లాంగ్ లివ్ ఇండియన్ ఆర్మీ అంటూ నినాదాలు ఇస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ కార్గిల్ లో సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ జూలై 26వ తేదీన ఏటా కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటామని అన్నారు. భారత సాయుధ బలగాల ధైర్యసాహసాలకు, ధైర్యానికి, త్యాగాలకు నివాళులర్పిచడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. అగ్నిపథ్ పథకం నిప్పులబాట పథకమని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడచినా ఆర్మీ అభ్యర్థుల పట్ల పాలకులు కనబరుస్తున్న తీరు బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సైనికుల పట్ల నిర్లక్ష్యం కనబర్చడం బాధాకరమని అన్నారు. సైనికులకు దీర్ఘకాలిక ఉపాధి కల్పించడం వల్ల వారు దేశానికి అంకిత భావంతో పనిచేసే బాధ్యతను ఎంచుకుంటారని పేర్కొన్నారు. కానీ మోడీ విధానాలు సైనికుల త్యాగనిరతిని దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ఆర్మీలో పెన్షన్ల భారం అంటూనే కాషాయ మత చాందస విధానాలకు అనుసరించే కుటిల ప్రయత్నాలలో భాగమే ఈఅగ్నిపథ్ నియామక ప్రక్రియ అన్నారు. గతంలో సైనిక ఉద్యోగమంటే దేశభక్తితో కూడుకున్నదని,డ్యూటీలో మరణిస్తే అది వీరమరణం అవుతుందని,రిటైర్‌మెంట్ తర్వాత జీవితానికి భరోసా ఉంటుందనే నమ్మకంతో సంవత్సరానికి 75వేల మంది యువత సైన్యంలో చేరేవారని, అలాంటి ఆలోచనలకు పూర్తిగా భిన్నమైంది ఈ 'అగ్ని పథ్' పథకమని తెలిపారు. అమెరికాలో అమలవుతున్న వాలంటరీ టూర్ ఆఫ్‌డ్యూటీ (నిర్దిష్ట ప్రాంతంలో నిర్దిష్ట సైనిక సేవలు) అనే విధానం నుండి ఈ 'అగ్ని పథ్' పథకాన్ని రూపొందించారని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న నిరుద్యోగ సైన్యానికి వీరు అదనంగా తోడవుతారన్నారు. సర్వరోగ నివారిణిగా ప్రచారం చేసిన ప్రయివేటీకరణ ఇప్పటికే అనేక రంగాల్లో సర్వరోగాల నిలయంగా మారిందన్నారు. ఇప్పుడు సైన్యంలోకి కూడా ఈ రోగం విస్తరించిందని పౌర జీవితంలో రగిల్చే మత విద్వేషాలను మరింత పెంచి పోషించేందుకు సైనిక రంగానికి కాషాయ రాజకీయాలు విస్తరిస్తున్నాయని వారు విమర్శించారు. సైన్యంలోకి ప్రవేశ పెట్టిన కాంట్రాక్టీకరణ, కాషాయీకరణ విధానాలను అడ్డుకోవడం దేశ పౌరులందరి కర్తవ్యమని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్, శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, రాష్ట్ర నేతలు మాజీద్ అలీ ఖాన్,రాజ్ కుమార్, శేఖర్, వంశీ, అనీల్ కుమార్, బాలు, మహేష్, మురళి, కిరణ్, ధీరజ్, కృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిలోపే 90వేల ఉద్యోగాల భర్తీ

సిఎం రేవంత్‌రెడ్డి

వట్టినాగులపల్లిలో ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏడాదిలోపే 90 వేల ఉద్యోగాలను భార్తీ చేయబోతున్నామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వట్టినాగులపల్లిలోని తెలంగాణ ఫైర్ సర్వీస్, సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌కు సిఎం ముఖ్యఅతిధిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న ఫైర్‌మెన్, డ్రైవర్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఏ ఆకాంక్షతో యువత తెలంగాణ పోరాటంలో పాల్గొన్నారో.. ఆ ఆకాంక్షను గత ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేసామన్నారు.అధికారంలోకి వచ్చి ఏడాది తిరగకముందే 60వేలకు పైగా ఉద్యోగాలు అందించి నిరుద్యోగుల్లో విశ్వాసం కల్పించామన్నారు. మరో 90రోజుల్లో మరో 30వేల ఉద్యోగాలను భర్తీ చేయ బోతునామని స్పష్టం చేశారు. ''నిరుద్యోగులకు, విద్యార్థులకు నా సూచన ఒక్కటే... మీకు సమస్యలు ఉంటే మంత్రులు, ఎమ్మెల్యేలకు విన్నవించండి.. మీ సమస్యలను పరిష్కరించేందుకు మీ రేవంతన్నగా మీకు ఎప్పుడూ అండగా ఉంటా..'' అని భరోసా కల్పించారు. శిక్షణ పూర్తి చేసుకున్న 483 మంది ఫైర్ మెన్‌లు, 157 మంది డ్రైవర్లు సిఎం శుభాకాంక్షలు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మిమ్మల్ని చూసి మీ తల్లిదండ్రులు గుండెల నిండా సంతోషిస్తున్నారన్నారు. సమాజాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో ముందుకు వచ్చిన మీ అందరినీ అభినందిస్తున్నానని అన్నా రు. ఈ ప్రభుత్వం ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళుతుందని, అందులో భాగంగానే విద్య, వ్యవసాయానికి బడ్జెట్ లో అత్యధిక నిధులు కేటాయించామని తెలిపారు.

ప్రజా ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా విద్య, వైద్యానికి బడ్జెట్ లో ప్రాధాన్యతనిచ్చామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీఖు జీతం అందించి ఉద్యోగులకు ప్రభుత్వంపై విశ్వాసం కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తూ ముందుకెళతామని పేర్కొన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరబోతున్న యువకులు ముందుగా తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని హితబోద చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేష్, హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, ఫైర్ సర్వీసెస్ జి.వి. నారాయణరావు, రీజినల్ ఫైర్ ఆఫీసర్ హరినాథ్‌రెడ్డిలతో పాటు డిఎఫ్ఒ, ఎడిఎఫ్ఒలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**సిఎంకు ఫైర్ డిజిపి నాగిరెడ్డి కృతజ్ఞతలు..**

అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన వారికి పోలీసు శాఖ మాదిరిగానే ఫైర్ సర్వీసెస్‌లో కూడా గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించినందుకు సిఎం రేవంత్‌రెడ్డికి ఫైర్ సర్వీసెస్ డిజిపి వై.నాగిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కొత్తగా 23 జిల్లాలలో డిఎఫ్ఎ అధికారులను నియమించడం జరిగిందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులను ఈ సందర్భంగా నాగిరెడ్డి అభినందించారు.



## బిఆర్‌ఎస్‌ను ప్రజలే చీల్చి చెండాడారు..

### అందుకే కేంద్ర బడ్జెట్‌పై కెసిఆర్ మౌనం : మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రజలు కెసిఆర్‌ను చీల్చి చెండాడితేనే ఎంపి ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలువలేక ఏడు సీట్లలో డిపాజిట్ కోల్పోయారని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నకిరేకల్ ఎంఎల్ఏ వేముల వీరేశంతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను భవిష్యత్తులో చీల్చి చెండాడుతామనడం సిగ్గు చేటన్నారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం దిశగా రెండు పార్టీల మధ్య చర్చలు నడుస్తున్నాయని తెలిపారు. అందుకే కెసిఆర్ కేంద్ర బడ్జెట్ పై నోరు మెదపట్లేదని ఎద్దేవా చేశారు. 8 నెలలు ఇంట్లో ఉండి ఇప్పుడొచ్చి రాష్ట్ర బడ్జెట్‌పై కెసిఆర్ విమర్శలు చేయడం, కేంద్రం పైసా ఇవ్వకున్నా నోరు మెదపకపోవడం దేనికి నిదర్శనం. నేను రెండు, మూడు రోజులు ఢిల్లీలో ఉన్న మాకు సమాచారం ఉంది. రాష్ట్రంలో అధికారం పోయి, ఎంపి ఎన్నికల్లో బిఆర్ఎస్ అడ్రస్ లేకుండా పోయింది. నిజంగా నేనయితే దుకాణం బంద్ చేసుకొని రాజకీయాల నుంచి తప్పుకునే వాడిని. కెసిఆర్ ఏ ముఖం పెట్టుకొని కాంగ్రెస్‌ను చీల్చి చెండాడుతా అని అంటడు. రాష్ట్రం ఏర్పడ్డ నాటికి 72 వేలకోట్ల అప్పు ఉంటే ఈ పదేండ్లలో 61 లక్షల 75 వేల కోట్ల అప్పు చేసిండు. ఈ డబ్బంతా కెసిఆర్ ఏం చేసిండు. బిఆర్ఎస్ చేసిన అప్పులకు ప్రభుత్వం వడ్డీలు కడుతుంది. దక్షణ తెలంగాణలో ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదు. కానీ కాంగ్రెస్ నిన్న ప్రకటించిన బడ్జెట్‌లో సాగు నీటికి కేటాయించిన 22 వేల కోట్లలో నల్లగొండ, మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాలకే ఇచ్చాం. ఎస్ఎల్‌బిసి, బ్రాహ్మణ వెల్లెంల, సీతారామ, పాలమూరు రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులకు ఎక్కువ నిధులు కేటాయించాం. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి రెండు నెలల్లో టెండర్లు పిలుస్తామని పేర్కొన్నారు.



## మంత్రి కొండా సురేఖకు దేవాలయ ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను సవరించినందుకుగాను తెలంగాణ దేవాదాయ శాఖ దేవాలయ ఉద్యోగుల సంఘం శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు సంఘం అధ్యక్షులు రంగారెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు మంత్రి సురేఖకు జూబ్లిహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, ప్రసాదాన్ని అందించి, వేదాశీర్వచనం చేశారు. సీనియారిటీ లిస్ట్ ను వీలైనంత త్వరగా సిద్ధం చేసి, ప్రమోషన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రి సురేఖను దేవాలయ ఉద్యోగుల సంఘం విన్నవించింది. వారి విన్నపానికి మంత్రి సురేఖ సానుకూలంగా స్పందించారు.

## వాస్తవాలను కప్పిపుచ్చుకునేందుకే కెటిఆర్ ప్రయత్నం : ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడిగడ్డ బ్యారేజీ అంశంలో న్యాయ విచారణ కొనసాగుతుందని,వాస్తవాలను కప్పి పుచ్చుకునేందుకే కెటిఆర్ ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ఎంఎల్‌సి టి. జీవన్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కారణమే బిఆర్ఎస్ అని, మేడిగడ్డ బ్యారేజీ విషయంలో ఆ పార్టీ మొసలి కన్నీరు ఆపాలని హితువుపలికారు. కెసిఆర్ ఇప్పటికైనా నైతిక బాధ్యత వహించాలని, వాస్తవ దృక్పథానికి రావాలన్నారు.అక్టోబర్ లోనే మెడిగడ్డ కుంగి పోయిందని, వేసవిలో కూడా నీటిని ఎత్తిపోయలేకపోయామని,మెడిగడ్డతో పాటు అన్నారం సుందిళ్ళ నీటి నిల్వకు పనికిరాదని రాతపూర్వకంగానే ఇచ్చారని తెలిపారు. నిర్మాణం, నిర్వహణ,డిజైన్‌లోపం ఉన్నదని విమర్శించారు. ఎల్లంపల్లి నుండే నీటిని తరలించే అవకాశాలను నీటిపారుదల శాఖ పరిశీలించాలని జీవన్ రెడ్డి తెలిపారు.

## కెసిఆర్ ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత లేదు: అన్వేష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**కెసిఆర్ హయాంలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఉండేదికాదని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి ఆరోపించారు.రేవంత్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవానికి దగ్గరగా ఉన్నదన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వం రైతు బంధు ఇచ్చి అన్ని ఎత్తేసిందని, సబ్సిడీ విత్తనాలు, రైతు భీమా, సబ్సిడీ కింద వచ్చే యంత్ర పరికరాలు కూడా ఎత్తేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయరంగానికి ఎన్నడూ లేనివిదంగా 25 శాతం నిధులను కేటాయించిందని,వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇచ్చేలా నిధులు కేటాయించిందని తెలిపారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వ బడ్జెట్ మోసపూరితం మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:**బిఆర్ఎస్ ప్రభుత్వం 2023లో ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరితమైందని ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జూపల్లి మాట్లాడుతూ.. 2023లో రెండు లక్షల తొంభై వేల కోట్లు కర్చుచేసినట్టు కెసిఆర్ ప్రజలకు చూపించాడని, ఆదాయాన్ని ఎక్కువగా చూపించి ప్రజలను మోసం చేసినప్పుడు, అది గ్యాస్, ట్రాష్ కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణ బడ్జెట్లో 25 శాతం వ్యవసాయానికి కర్చుపెడితే 15 శాతం గత ప్రభుత్వం అప్పులు తీర్చడంలోనే సరిపోతుందన్నారు. కెసిఆర్ అమల్లోకి తెచ్చిన రైతు బంధుని రైతు భరోసా గా మార్చి కొనసాగించాం అన్నారు. రైతు పండించిన ధాన్యానికి అదనంగా 500 రూపాయిలు బొనస్ ఇచ్చామని గుర్తు చేశారు.ఏడు నెలల్లో తాము రూ.30,000 కోట్ల అప్పు తెచ్చాము అని కెసిఆర్ మాట్లాడుతున్నాడని, మేం తెచ్చిన అప్పు బిఆర్ఎస్ చేసిన అప్పులు తీర్చడానికే సరిపోతుందన్నారు. అసెంబ్లీ కి కెసిఆర్ ఇన్నిరోజులు ఎందుకు రాలేదు? అంత గర్వమా? అని ప్రశ్నించారు. కెసిఆర్ కన్నా రేవంత్ రెడ్డి ది చిన్న వయసు కాబట్టి ఆయన ముందు అసెంబ్లీ లో కూర్చోవడానికి కెసిఆర్‌కి చిన్న చూపా? అని అన్నారు. 6 గారంటీలు కూడా ఒక్కొక్కొటిగా అమలు చేస్తున్నప్పటికీ కెసిఆర్ తమ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.



## డిఎస్ రామచంద్రరావుకు అస్వస్థత

### సిఆర్ ఫౌండేషన్‌కు తరలింపు

### పరామర్శించిన సిపిఐ, సిఆర్ ఫౌండేషన్ నేతలు

**ప్రజాపక్షం / హైదరాబాద్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్ లో అర్థశతాబ్దం పాటు కోశాధికారిగా, ఆఫీసు కార్యదర్శిగా పనిచేసిన ధూళిపాళ సీతారామచంద్రరావు ఆకస్మికంగా అస్వస్థతకు గురైన కారణంగా ఆయనను రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి తరలించి అత్యవసర చికిత్సలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావును సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ, అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జల్లి విల్సన్, కె.అజయ్‌కుమార్, కార్యదర్శి పి.జె.చంద్రశేఖర రావు, కోశాధికారి వి.చెన్నకేశవ రావు పరామర్శించారు. రామచంద్రరావు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆయన వెంట కుమారుడు చింతామణి ఉన్నారు. రామచంద్రరావుకు అవసరమైన సేవలు నిమిత్తం వ్యక్తిగత సిబ్బందిని ఏర్పాటు చేసి, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కూనంనేని రజిని పర్యవేక్షణలో వైద్య సహాయం అందజేస్తున్నారు.

'317 జిఒ'తో అన్యాయం జరిగిన

## ఉద్యోగుల వివరాలను సమర్పించండి

### మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో నిర్ణయం

**ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో** '317 జిఒ' ద్వారా అన్యాయం జరిగిన ఉద్యోగుల వివరాలను త్వరలోనే మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని ''317 జిఒ'' మంత్రివర్గ ఉప సంఘం అధికారులను ఆదేశించింది. '317జిఒ సమస్యలపైన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం సమావేశం హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు, మంత్రులు దుద్దిళ్ళశ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్‌తో పాటు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం,జిఎడి ముఖ్యకార్యదర్శి మహేష్ కుమార్ ఎక్కాదత్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి రవిగుప్తా, పిఆర్‌సి ఛైర్మన్ శివశంకర్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా, ముఖ్యకార్యదర్శి నదిమ్, న్యాయ శాఖ కార్యదర్శి తిరుపతి,సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, ఇంటర్మీడియట్ బోర్డ్ డైరెక్టర్ శృతి ఓజా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిని, సాంఘీక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, విద్యా శాఖ సంచాలకులు వెంకట నరసింహ రెడ్డి,బూసని వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

'317 జిఒ' మంత్రివర్గ ఉప సంఘం గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదిక అందజేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. కొన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సమాచారం అందించినప్పటికీ మరికొన్ని శాఖల నుండి 317 జీవో బాధిత ఉద్యోగులకు సంబంధించిన నిర్దిష్టమైన సమాచారం రావాల్సి ఉన్నదని మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయపడింది. 317 జిఒ కింద వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి న తర్వాత, 30 నుండి 40 శాతం మంది ఉద్యోగులు చేసుకున్న దరఖాస్తులు పునరావృత్తం అయినట్టు క్యాబినెట్ సబ్ కమిటీ గుర్తించింది. క్యాబినెట్ సబ్ కమిటీ 317 జిఒ వెసులుబాటుకు ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరిం చాలానే ఉద్దేశానికి వ్యతిరేకంగా కొంతమంది ఈ వెసులుబాటును ఉపయోగించుకుని వారి వారి సొంత జిల్లాకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్టు కమిటీ దృష్టికి వచ్చింది.



## తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ.. ఎఐఎస్‌ఎఫ్ నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర బడ్జె ట్లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ.. హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద ప్లకార్డుల తో ఎఐఎస్‌ఎఫ్ నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ.... రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన మొత్తం బడ్జెట్ 2,91,159 కోట్లులో విద్యారంగానికి కేటాయించిన నిధులు 21,292 కోట్లు (7.31%) కేటాయించారని, ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం ఏ మాత్రం ఈ నిధులు సరిపోవు. గత ప్రభుత్వం 2014 సంవత్సరంలో మాత్రమే 10.89% నిధులు కేటాయించి, ప్రతి సంవత్సరం నిధులు తగ్గించుకుంటూ వస్తూ.. 2023–2024 సంవత్సరానికి విద్యలో 6.6 శాతానికి నిధులు తగ్గించిందన్నారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30% శాతం నిధులు కేటాయించాలని అనేక మంది విద్యావేత్తలు, మేధావులు చెబుతున్నప్పటికే ప్రభుత్వాలు మాత్రం పెడచెవిన పెడుతున్నాయన్నారు.రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యారంగానికి 15% శాతం నిధులు కేటాయిస్తాం అని ప్రకటించడం జరిగిందని,అదే విధంగా ప్రతి మండలానికి ఒక అంతర్జాతీయ పాఠశాల, ల్యాప్ టాప్‌లు, విద్యార్థినులకు ఎలక్ట్రికల్ స్కూటీలు, సమీకృత గురుకులాలు అని చెప్పడం జరిగిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత తక్కువ నిధులు కేటాయించడం చూస్తే విద్యార్థులను మోసం చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, ఓయూ అధ్యక్షుడు లెనిన్, నాయకులు లక్ష్మ ణ్, సాయి , వెంకట్ , రాము, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణకార్మికుల సమస్యలు పరిష్కరించి

## పెండింగ్ క్లెయిమ్స్ నిధులు విడుదల

సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి

కార్మిక శాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన ఎఐటియుసి ప్రతినిధి బృందం



**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యాపితంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ నిధులు విడుదల చేసి సకాలంలో పరిష్కరించాలని సిపిఐ శాసనసభ పక్ష నాయకులు, కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. శ్రమను నమ్ముకుని నిరంతరం భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్నప్పటికి నిర్మాణ కార్మికుల జీవితంలో వెలుగులేదని ఆయన పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కూనంనేని సాంబశివరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవాధ్యక్షులు వి.రత్నాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్ గౌడ్‌లతో కూడిన ప్రతినిధిబృందం శుక్రవారం టి.అంజయ్య భవన్‌లో కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మీడియా తో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణించిన నిర్మాణ కార్మికుల కుటుంబానికి రూ.10లక్షలు, సహజ మరణం పొందితే రూ.5 లక్షలు చెల్లించాలని కోరారు. అరవై ఏండ్లు నిండిన భవన కార్మికులకు ప్రతినెలా రూ.6 వేలు పెన్షన్ చెల్లించాలని, సంక్షేమ బోర్డు సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెళ్ళి కానుక రూ.లక్షకు పెంచాలని, ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికుల్లో ప్రభుత్వానికి కడుతున్న ఒక శాతం సెస్సును 2 శాతానికి పెంచాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల బతుకులు మార్చటానికి అనేక చట్టాలు ఉన్నప్పటికి అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ వేలి ముద్ర పద్ధతిని తొలగించి పాతపద్ధతిలో భవన నిర్మాణ కార్మికులకు కార్డులు ఇవ్వాలన్నారు. వి.రత్నాకర్ రావు, మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ బిల్డింగ్ బల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)కు సంక్షేమ బోర్డులో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ప్రవీణ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పాండిచ్చేరి ప్రభుత్వం ఇస్తున్న తరహాలో దసరాకు రూ.3వేలు చెల్లించాలని, ఢిల్లీ, కర్నాటక ప్రభుత్వాలు ఇస్తున్న తరహాలో నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, 1996 చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి నిర్మాణ కార్మికులకు అన్ని ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కమతం యాదగిరి, పానుగంటి పర్వతాలు, వేల్పుల మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

**కమిషనర్ సానుకూల స్పందన:** భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీషుకెళ్ళి పరిష్కరించేందుకు చర్య లు తీసుకుంటామని కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య ప్రతినిధి బృందానికి భరోసా ఇచ్చారు.

## 29 నుంచి ఆగస్టు 5 వరకు సింగరేణి పరిరక్షణ యాత్ర : ఎస్. వీరయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బొగ్గు బ్లాకులను సింగరేణికే నేరుగా కేటాయించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వీరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే నేరుగా కేటాయించాలని, వేలం పాటను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్రను చేపడుతున్నట్టు వీరయ్య చెప్పారు.




హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లోని ఎం.బి. భవన్‌లో శుక్రవారం సింగరేణి పరిరక్షణ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి. జ్యోతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ ఉదయం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం యాత్రను ప్రారంభిస్తారని చెప్పారు. వచ్చేనెల 5వ తేదీ వరకు ఈ బస్సుయాత్ర కొనసాగుతుందన్నారు. కొత్తగూడెంలో ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరించామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మోసపూరిత ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. బొగ్గు గనుల వేలంపాటలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని తప్పిదం చేశారని విమర్శించారు. సింగరేణి పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిల పక్షాన్ని కేంద్ర ప్రభుత్వం వద్దకు తీసుకపోవాలని కోరారు. సింగరేణి పరిరక్షణ కోసం సిపిఐ(ఎం) చేపట్టిన పోరాటానికి రాష్ట్ర ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని వీరయ్య కోరారు.


## ఆర్‌టిసి నిర్వహణ, కార్మికుల వేతన బకాయిల చెల్లింపుకు నిధులేవి?

టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ విమర్శ

'**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జె ట్‌లో ఆర్‌టిసి మహాలక్ష్మి పథకానికి రూ.4,083 కోట్లు కేటాయించినందుకు ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ స్వాగతించింది. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన సూపర్ 6 గ్యారెంటీల అమలు కోసమే బడ్జెట్‌లో నిధులు పెట్టుకుని ఆర్‌టిసిని గాలికి వదిలేసిందని విమర్శించింది. ఆర్‌టిసి నిర్వహణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం చా లా అన్యాయమని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియ న్ అధ్యక్షుడు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఇ. వెంకన్న తెలిపారు. ఉద్యోగుల జీతాల నుంచి యాజమాన్యం వాడుకున్న పిఎఫ్, సిసిఎస్ డబ్బులు సుమారు రూ.2000 కోట్లు, 2013 వేతన సవరణకు సంబంధించిన బకాయిలు, ఆర్‌పిఎస్ 2017 కు సంబంధించిన వేతన సవర ణ బకాయిలు, ఆర్‌పిఎస్ 2021 ఇంప్లిమెంటేషన్‌కు సంబంధించిన ఆర్థిక సహాయం, విద్యార్థు లు, వికలాంగులు తదితర వర్గాల వారికి ఇవ్వాల్సిన రాయితీలు, కాలం చెల్లిన బస్సుల స్థానం లో కొత్త బస్సుల కొనుగోలుకు డబ్బు సర్దుబాటు, ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే సందర్భంగా ఉద్యోగులకు అవసరమయ్యే నిధులు, సంస్థలో ఉన్న అనేక ఖాళీలను రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ ద్వారా అవుతున్న ఖర్చు తదితర అవసరాలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధు లు కేటాయించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశా రు. రాష్ట్ర వ్యాప్తంగా 94 డిపోలు, 3 ప్రొడక్షన్ యూటనిట్లతో 42,000మంది ఉద్యోగులు ఉన్న ఆర్‌టిసి సంస్థకు ఒక్క మహాలక్ష్మి పథకం కింద రూ.4000 బడ్జెట్ కేటాయించడం అన్యాయమన్నారు. ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రయాణీకుల కోసం కొత్త బస్సులు కొనుగోలు చేయటానికి బడ్జెట్ ప్రొవిజన్ ఎందుకు కల్పించలేదని వారు ప్రశ్నించారు. ఆర్‌టిసి కార్మికులకు వారి ఎలక్షన్ మేనిఫెస్టోలో పెట్టిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని వారు విమర్శించారు. 2021 వేతన సవరణ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అందుకు అవసరమైన ఆర్థిక వనరులను ఈ బడ్జెట్‌లో సమకూర్చలేక పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆర్‌టిసిపై వివక్ష చూపుతోందని, టిఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో ఆర్‌టిసికి రావలసిన రూ.750 కోట్ల రాయితీలను బడ్జెట్లో చూపించలేదన్నారు. శాసనసభలో ఆర్‌టిసి సమస్యలపై చర్చ సందర్భంగా యూనియన్ల పునరుద్ధరణ, ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడం తదితర అంశాలను ప్రక్కనపెట్టి అధికార, విపక్షాల దూషణకే సరిపోయిందన్నారు. ఆర్‌టిసికి ఇవ్వాల్సిన రాయితీలకు ఎగనామం పెట్టిందని వారు ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌పై ఆర్‌టిసి కార్మికులు పెట్టుకున్న ఆశలను అడియాసలు చేసిందని వారు తీవ్రంగా నిరసించారు.

## 'డయల్ 100','డయల్ 112' కీలక పాత్ర : డిజిపి డాక్టర్ జితేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాంతి భద్రతలను కాపాడటంలో, త్వరితగతిన పోలీసు సిబ్బంది స్పందించడంలో 'డయల్ 100','డయల్ 112' కీలక పాత్రను పోషించాయని డిజిపి డాక్టర్ జితేందర్ అన్నారు. డయల్ 100,112 పని తీరుపైన పోలీస్ కమిషన ర్లు, ఎస్‌పిలు,స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో శుక్రవారం డిజిపి జితేందర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ 100,112హెల్ప్‌లైన్‌కు వచ్చిన కాల్స్ పట్ల సత్వరమే , సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు డిజిపి లు మహేష్ ఎం భగవత్ , వి.వి. శ్రీనివాస రావు, ఐజిపిలు ఎం. రమేష్, వి.సత్యనారాయణ, హైదరాబాద్ సిటీ జాయింట్ సిపి పరిమళ హననూతన్ తదితరులు హాజరయ్యారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో, నైపుణ్యం, స్పందనలో అత్యున్నత ప్రమాణాలను పాటించాలని డిజిపి సూచించారు.

## నత్త నడకన పెద్దవాగు బ్రిడ్జి



Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **09-08-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 85 of 2024**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA- Branch**

**... Disputant**

AND

VANARASHI AJAY & Others

**... Opponents**

1. Mr. VANARASHI AJAY, S/o. RAMULU, Age: 28 years, Occ: Private Employee, R/o. H-No. 192/3, REGONDA, JAYASHANKAR BHUPALPALLY.
3. Ms. PUNNAM LAXMI, D/o. LAXMAIAH, Age: 48 years, R/o. H.No: 4-36, SAKALIWADA, RANGAIAHPALLI, REGONDA, JAYASHANKAR BHUPALPALLY

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **09-08-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

# పట్టాలు వచ్చేవరకు భూపోరాటాలు ఉధృతం

## సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు





**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** అర్హులందరికీ పట్టాలు వచ్చేవరకు భూపోరాటాలు ఉధృతం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. శుక్రవారం జిల్లా కేందంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ ఒకరోజు దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి గోద శ్రీరాములు హాజరై మాట్లాడారు. పట్టణంలో ఇండ్లు, ఇండ్లస్థలాలు లేని సుమారు రెండువేల మంది అర్హుల జాబితాను సిపిఐ సేకరించిందని, మండల పరిధిలోగల హనుమాపురం సర్వేనెంబర్ 28లో 76ఎకరాలు, బొమ్మాయిపల్లి సర్వేనెంబర్ 118లో లేఅవుట్ చేసి వారందరికీ స్థలాలు ఇవ్వాలని కోరారు. బస్వాపురంలో పట్టాలు పొందిన వారికి స్థలాలు ఇచ్చేంతవరకు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు ఇచ్చి రూ.ఐదు లక్షల ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పలుమార్లు ఆందోళనలు నిర్వహిస్తూ కలెక్టర్‌కు అర్హులైన వ్యక్తిగత దరఖాస్తులు సమర్పించామన్నారు. స్థానిక శాసనసభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి ఈ సమస్య తీసుకురావడం జరిగిందన్నారు. దీక్ష శిబిరాన్ని భువనగిరి తహసీల్దార్ అంజిరెడ్డి సందర్శించి సమస్యలు విని పట్టాలు ఇప్పించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. హస్నాబాద్ భూమిపై ప్రభుత్వానికి తెలియపరచి నిర్ణయిస్తామన్నారు. దీక్ష కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, సిపిఐ భువనగిరి పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తువుల అభిలాష్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి చింతల మల్లేశం, ఉడుత రాఘవులు చింతల పెంటయ్య, చిక్కా బిక్షపతి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, ప్రజా సంఘాల నాయకులు బద్దం వెంకటరెడ్డి, నాగపురి యాదగిరి, చొప్పరి సత్తయ్య, ఎస్‌కె అమీర్, చిక్క నరసయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు

# సమస్యల పరిష్కారంలో ప్రజాసంఘాలే కీలకం : భిక్షపతి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా సంఘాలే కీలకం అని సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. శుక్రవారం హన్మకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సమావేశం బాషబోయిన సంతోష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అర్హులైన పేదలకు ఇండ్లస్థలాలు, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఈనెల 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ధర్నాకు జిల్లావ్యాప్తంగా పేదలు, గుడిసెవాసులు పెద్దఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా సహాయకార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్రసమితి సభ్యులు ఎన్.అశోక్‌స్టాలిన్, పార్టీ ప్రజాసంఘాల నాయకులు సిరబోయిన కరుణాకర్, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, మంచాల రమాదేవి,కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్, మాలోతు శంకర్ నాయక్, నిమ్మల మనోహర్, ప్రణీత్ గౌడ్, లావుడ్య రమాదేవి పాల్గొన్నారు.

# నూతన రేషన్ కార్డులు ఇవ్వాలి

## సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు అందిస్తేనే అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందుతాయని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పద్మశాలి భవనంలో నిర్వహించిన పార్టీ విస్తృత నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇంటి స్థలాలు, రెండు పడకల ఇండ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లంల యాదగిరి, జిల్లా సమితి సభ్యులు బూర వెంకటేశ్వర్లు, ఎఐటియూసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం నాయక్, కోట రామస్వామి, మండల కన్వీనర్ పాల్వాయి పున్నయ్య, ప్రతాప్, బాణోతు సతీష్, రవీందర్, రోషయ్య, సత్యనారాయణ, దేవేందర్, శ్రీనివాస్, గిరి, రాజు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్య పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలి : సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రభుత్వ విద్య పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలి ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఇంచార్జీ నెల్లికంటి సత్యం విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. స్థానిక ఎఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో సత్యం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నప్పటికీ వాటిని విస్మరిస్తున్నారని ఆరోపించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు బకాయిలు చెల్లించాలని, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు దుప్పట్లు ప్లేట్లు, పెట్టెలు, అన్ని రకాల సామాగ్రి అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.శోభన్ బాబు, సహాయ కార్యదర్శి తిరిగి ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు ఇస్కిల్ల మహేందర్, చాపల విప్లవ్, అఖిల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఐటియుసిలో చేరిక



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** శుక్రవారం కొత్తగూడెంలోని స్థానిక శేషగిరి భవన్‌లో టాటా మ్యాజిక్ డ్రైవర్లు, ఓనర్లు ఎఐటియుసి కార్మిక సంఘంలో చేరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్, కార్మిక రంగం ప్రధానమైందన్నారు. మోటార్ కార్మిక, కర్షకుల పట్ల పోరాటాలు నిర్వహించి వారికి సంక్షేమ పథకాలను అందించడంలో ఎఐటియుసి ముందున్నదన్నారు. మోటార్ కార్మికులు వారి కాళ్ళపై నిలబడి దేశపురోగతిలో పాలుపంచుకుంటున్నారని, మారుమూల ప్రాంతాలకు ప్రభుత్వం రవాణాసౌకర్యాలు అందించలేకపోయిన టాటా మ్యాజిక్ డ్రైవర్లు, ప్రజల అవసరాలకు అనుగుణంగా రవాణా రంగాన్ని నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. నూతనంగా ఎఐటియుసి కార్మిక సంఘంలో చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ గెద్దాడ నగేష్, శ్యామ్, బాలాజి, సుదా, రఘు, వేముల తిరుపతిరావు, వెంకట్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# 31న మధ్యాహ్న భోజన కార్మికుల చలో హైదరాబాద్ : ఎఐటియుసి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రధాన డిమాండ్‌తో ఈనెల 31న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఓమయ్య అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్నాకు జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చక్రపాణి, టోకు నర్సింహా పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలే ఎజెండా

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్ నరసింహ్మ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా నిరంతరం ప్రజల్లో మమేకం కావడానికి కార్యకర్తలు కృషిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల్‌నరసింహ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాసమితి సభ్యుల రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్ నరసింహ్మ మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ పదవులు ఆశించకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యకర్తలను ఆయన అభినందించారు. దేశ సమైక్యతను భంగం కలిగించే వారి పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ, లౌకికవాదానికి, ప్రజాస్వామ్య రక్షణకు పార్టీ శ్రేణులు నిరంతరం పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. పట్టణాల్లో, గ్రామాల్లో పండుగలు పేరిట ప్రజలను ఏకం చేయడానికి స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు బిజెపి పాల్పడుతుందని విమర్శించారు. ప్రతి పండుగలో ముందు ఉంటూ భక్తి పేరిట బిజెపి రాజకీయ విషాన్ని నింపుతూ లాభపడుతూ వస్తుందన్నారు. హిందూమతం పేరుతో ఓటు బ్యాంకును పెంచుకుంటున్నారనే వాస్తవాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం కమ్యూనిస్టులుగా మనపై ఉందన్నారు. మతోన్మాద శక్తులను పెంచి పోషిస్తున్న బిజెపిని అడ్డుకోవడానికి ప్రజలను సిద్ధం చేయాలని ఆయన కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు పోరాటాలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు, నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి మోహన్‌రెడ్డి, సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాల్‌కిషన్, వనపర్తి జిల్లా కార్యదర్శి జయరాములు, గద్వాల జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య, నారాయణపేట జిల్లా కార్యదర్శి కొండన్నలతో పాటు సిపిఐ సీనియర్ నాయకులు ఆనంద్, సురేష్, అల్వాల్ రెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు రాము, రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగం అభివృద్ధికి నోచుకోదా?

## బడ్జెట్ సవరించి నిధులు పెంచాలి

## ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించిందని, ప్రజాపాలనలో విద్యారంగం అభివృద్ధికి అధిక నిధులు కేటాయించకపోవడం సరికాదని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం కమాన్ చౌరస్తాలో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి కేవలం రూ.21292 కోట్లు(7.3 శాతం) నిధులు మాత్రమే కేటాయించిందన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో విద్యకు బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి రూ.500 కోట్లు ఇచ్చారని, అందులో ఓయుకి రూ.100 కోట్లు, మహిళా యూనివర్సిటీకి రూ.100 కోట్లు మిగతా అన్ని యూనివర్సిటీలకు కలిపి రూ.300 కోట్లు కేటాయించారని, ఈ నిధులతో విద్యార్థుల మౌలిక వసతుల కల్పన, యూనివర్సిటీలలో విద్యా ప్రమాణాలు ఏ విధంగా పెరుగుతాయని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియన్, డిగ్రీ కళాశాలల్లో మౌలిక వసతులకు ప్రత్యేక నిధులు లేవన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపుపై ప్రకటన లేదని, అద్దె భవనాల నిర్వహణలో ఉన్న వాటికి కొత్త భవనాల నిర్మాణానికి నిధులు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలే రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి ఊసే లేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని చెప్పారని, వాటి గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. మండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుపై ప్రకటన, అందుకు నిధుల కేటాయింపుపై బడ్జెట్‌లో మాట రాలేదన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యం అయ్యిందని, కాంగ్రెస్ పాలనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని ఆశిస్తే భంగపాటే ఎదురయ్యిందన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులను సవరించి పెంచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చ రమేష్, జేరిపోతుల జనార్దన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రేణికుంట్ల ప్రీతం, అక్రమ్ మాలిక్, రామారపు వెంకటేష్, సంగెం మధు, నాయకులు మామిడిపల్లి హేమంత్, రామగల్ల నరేష్, కనకం సాగర్, కేశబోయిన రాము, అలువాల విష్ణు, సందీప్ రెడ్డి, శ్రావణ్, సచిన్, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం విద్య భరోసా పథకాన్ని అమలు చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి బడ్జెట్ లో విద్యారంగాన్ని చిన్నచూపు చూసిందని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు ప్లక్కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేరెళ్ల జోసెఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగంపై చిన్నచూపు చూసిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు ఒద్దుల సాకేత్ రెడ్డి, సంపత్, రాజేష్, దిలీప్, సాయి, లావణ్య, స్వరూప వనిత పాల్గొన్నారు.

# సమర్థవంతంగా బడ్జెట్ అమలు

## సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో వివిధ శాఖలకు కేటాయించిన బడ్జెట్‌ను సమర్థవంతంగా అమలుకు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. సిపిఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గ్రామశాఖ కార్యదర్శిలు, జిల్లా కౌన్సిల్ సభ్యులకు రెండురోజుల పాటు గణేష్‌నగర్ ఎల్‌ఐసి భవన్‌లో జరిగిన రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసాయి. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మర్రి వెంకటస్వామి మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ఆశాజనకంగా ఉందని, ఇచ్చిన హామీల అమలుకు కృషిచేయాలని కోరారు. ప్రతిపక్షహోదాలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ బడ్జెట్ సమావేశాల్లో పూర్తిస్థాయిలో పాల్గొనకుండా, తన తొమ్మిదన్నర సంవత్సరాల పరిపాలన అనుభవంలో బడ్జెట్‌లో ఉపయోగకరమైన అంశాలను సూచించకుండా, బయటకు వచ్చి ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సంక్షేమం పట్ల, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కెసిఆర్ తన అనుభవాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాల కోసం నిధులు కేటాయించారని, వాటిని అమలు చేయాలని, అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. అనేక ప్రభుత్వ భూములు గత పాలకులు కబ్జాలు చేశారని, ఆభూముల పరిస్థితి ఏమిటో తేల్చాలన్నారు. మిగులు భూములను పేదల ఇండ్ల స్థలాలకు ఇవ్వాలని, భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు భూమి ఇవ్వాలని, రేషన్ కార్డులపై కార్యచరణ లేపడాలన్నారు. ధరణి పోర్టల్‌లో రైతుల భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. భూ సర్వే నిర్వహించి సాగు చేసుకుంటున్న అసలైన పట్టాదారులకు పట్టాదారు పాసుబుక్కులు అందించాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వస్త్ర పరిశ్రమ చేనేత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. శిక్షణ తరగతుల్లో 'మతం, మతోన్మాదం, ప్రమాదంలో భారత రాజ్యాంగం అనే అంశంపై ఉమామహేశ్వర్ బోధించారు. 'పార్టీ' కార్యక్రమం అంశంపై సింగు నర్సింహారావు మాట్లాడారు. సమావేశంలో సిద్దిపేట, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల సిపిఐ కార్యదర్శులు మంద పవన్, తాండ్ర సదానందం, వెన్న సురేష్, సిపిఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# అంతరాలులేని సమాజ నిర్మాణం ధ్యేయం

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/నెక్కొండ :** అంతరాలు లేని సమాజ నిర్మాణమే ధ్యేయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నర్సంపేట నియోజకవర్గ సిపిఐ రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతులు నెక్కొండ మండల కేంద్రంలో ప్రారంభమయ్యాయి. శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమానికి మండల కార్యదర్శి కందిక చెన్న కేశవులు అధ్యక్షత వహించగా తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పెట్టుబడిదారి దోపిడి వ్యవస్థలో పేదలు, ధనికుల మధ్య తారతమ్యం పెరుగుతూ పోతుందని, పాలకులు పేదల అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్, పెట్టుబడిదారి శక్తుల కోసమే పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చిన ప్రజల మధ్య రోజు వారి ఆదాయం వ్యత్యాసం వేల రెట్లు ఎక్కువగా ఉందన్నారు. ఈ క్రమంలో దేశంలోని బూర్జువా రాజకీయ పార్టీలు కులం, మతం పేరుతో ప్రజలను విభజించి పాలిస్తూ దోపిడీపై తిరుగుబాటు చేయకుండా అడ్డుకుంటున్నాయన్నారు. ఈతరుణంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ది పొందాలని చూసే పార్టీలకు కాలం చెల్లిందన్నారు. లౌకిక దేశమైన భారతదేశంలో మత రాజకీయాలు, మతోన్మాద శక్తులు అంతరించిపోక తప్పదన్నారు. కేంద్రంలో గత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పనిచేసిందని, మరోసారి వారి అండతోనే అధికారంలోకి వచ్చి వారి కోసమే పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పార్టీ బలోపేతానికి సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్ మిషా, జిల్లా కార్యవర్గసభ్యులు అక్కపెల్లి రమేష్, బుస్సా రవీందర్, జిల్లా సమితి సభ్యులు ఆరెల్లి రవి పాల్గొన్నారు.



# దుర్మార్గపు కుట్రలు తిప్పికొడతాం..

(మొదటి పేజీ తరువాయి)

కుట్రలు ఎన్నటికీ ఫలించవు. మా దళాలు ఉగ్రవాదాన్ని నలిపివేసి.. శత్రువులకు తగిన జవాబిస్తాయి' అని మోదీ పాక్‌ను హెచ్చరించారు. 'కార్గిల్ యుద్ధానికి లధాఖ్ సాక్షిగా నిలుస్తుంది. అమరుల త్యాగాలకు గుర్తుగా విజయ్ దివస్ జరుపుకుంటున్నాం. మన బలానికి, సహనానికి, వాస్తవాలకు ఈ విజయగాథ నిదర్శనం. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన సైనికులు చిరకాలం గుర్తుండిపోతారు. కార్గిల్ యుద్ధ సమయంలో సామాన్యుడిగా సైనికుల మధ్య ఉండే అదృష్టం నాకు దక్కింది. దేశం కోసం వారు చేసిన పోరాటం నా మదిలో నిలిచిపోయింది. లధాఖ్, జమ్ముకశ్మీర్ అభివృద్ధి కోసం ఎలాంటి సవాళ్లనైనా భారత్ అధిగమిస్తుంది. మరికొద్ది రోజుల్లో ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదేళ్లు పూర్తవుతాయి. ఇప్పుడు జమ్ముకశ్మీర్ ప్రజలు సరికొత్త భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్నారు. పెద్ద కలల గురించి మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం కశ్మీర్ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు నిలయంగా ఉంది. ఈ భూలోక స్వర్గం శాంతి, సౌభ్రాతృత్వం వైపు వేగంగా పరిగెడుతోంది' అని మోదీ తెలిపారు. అంతకుముందు, యుద్ధ స్మారకం వద్ద కార్గిల్ అమరవీరులకు ప్రధాని నివాళులర్పించారు. వీర జవాన్ల కుటుంబసభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా షింకున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ నిర్మాణపనులను ప్రధాని మోదీ ప్రారంభించారు. టన్నెల్ నిర్మాణ ప్రాంతం వద్ద వర్చువల్‌గా తొలి బ్లాస్ట్ చేశారు. 4.1 కిలోమీటర్ల పొడవైన ఈ ట్విన్ ట్యూబ్ టన్నెల్‌ను 15,800 అడుగుల ఎత్తులో నిర్మించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సాయుధ దళాలను వేగంగా తరలించేందుకు, సైనిక సామగ్రిని చేరవేసేందుకు ఈ సొరంగం సమర్థంగా ఉపయోగపడనుంది. దీని నిర్మాణం పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సొరంగంగా గుర్తింపు సాధించనుంది.

**రాష్ట్రపతి సహా పలువురు నివాళులు..**

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఎక్స్ వేదికగా అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. 'మన సాయుధ దళాల ధైర్యం, పరాక్రమానికి ప్రతీక విజయగాథ. 1999 నాటి కార్గిల్ యుద్ధంలో మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన ప్రతి జవాన్‌కు నివాళులర్పిస్తున్నా. వారి త్యాగం, శౌర్యం నుంచి దేశ ప్రజలంతా స్ఫూర్తి పొందుతారు. జై హింద్. జై భారత్'' అని రాష్ట్రపతి రాసుకొచ్చారు. ఇక, ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం వద్ద కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమర జవాన్లకు నివాళులర్పించారు. ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అంజలి ఘటించారు. అమరవీరుల త్యాగాలను వృథా కానివ్వబోమని అన్నారు.

# ప్రతిపక్షాలు ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఇతర పార్టీ నాయకులు ఆరోపించారు. పైగా ఆర్మీ ఆదేశాల మేరకే తమ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసిందని ప్రధాని చేసిన వ్యాఖ్యలు 'పచ్చి అబద్ధం' అని దుయ్యబట్టారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించడం వంటి సందర్భాల్లోనూ ప్రధాని నరేంద్ర మోదీ చిల్లర రాజకీయాలు చేయడం చాలా దురదృష్టకరం, శోచనీయమని ఖర్గే అన్నారు. 'సైన్యం కోరిక మేరకే తమ ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని అమలు చేసిందని మోడీ జీ చెబుతున్నారు. ఇది పచ్చి అబద్ధం. మన పరాక్రమ సాయుధ బలగాలకు క్షమించరాని అవమానం. మోడీ జీ, మీరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారు' అని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. చాలా మంది రిటైర్డ్ అధికారులు ఈ పథకాన్ని తీవ్రంగా విమర్శించారని ఖర్గే పేర్కొంటూ...అగ్నిపథ్ పథకం దేశ భద్రతకు, గ్రామీణ యువత ఆకాంక్షలకు ప్రమాదం కలిగిస్తోందని అన్నారు. ఇదంతా రికార్డులో ఉందని, ఈ పథకాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్గిల్ విజయ్ దివస్ రోజున కూడా మోదీ అబద్ధాలు చెబుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆరోపించారు. 'అగ్నిపథ్/అగ్నివీర్ పథకాన్ని సైన్యం ప్రవేశపెట్టిందని ఆయన (మోడీ) చెప్పారు. ఆ సమయంలో ఆర్మీ చీఫ్‌గా ఉన్న జనరల్ ఎంఎం నరవాణే ఈ పథకం సైన్యాన్ని పూర్తిగా ఆశ్చర్యపరిచిందని 'బ్లాల్ ఫ్రమ్ ది బ్లూ' అని రాశారు. నావికాదళం, వైమానిక దళానికి మోడీ ఇప్పుడు ఈ వినాశకరమైన పథకానికి బాధ్యత వహించకుండా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. చాలా తక్కువ సంప్రదింపులతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చారని కాంగ్రెస్ ఎంపి వివేక్ తంఖా పేర్కొన్నారు. సంప్రదించిన వారికి మార్పులు సూచించే ధైర్యం లేదని ఆయన ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ ఎంపి రంజిత్ రంజన్ అన్నారు. జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) ఎంపి మహువా మజీ మాట్లాడుతూ అగ్నివీరులకు ఎలాంటి సామాజిక భద్రత కల్పించనందున ఈ పథకాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్గిల్ అమరవీరులకు సెల్యూట్ చేస్తున్నా.. విదేశీ దేశాలు మనపై దాడి చేసినప్పుడల్లా మన వీర జవాన్లు తమ ప్రాణాలను త్యాగం చేశారని ఆమె అన్నారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ ఎంపి డోలా సేన్ అగ్నివీర్ పథకంపై ప్రధాని వ్యాఖ్యలను తోసిపుచ్చారు. 'సైన్యం ఎప్పుడూ యవ్వనంగా ఉంటుంది, బహుశా ప్రధానికి తెలియకపోవచ్చు.. వారు చిన్న వయస్సులోనే స్వచ్ఛంద పదవీ విరమణ పొందుతారు. వారు దేశానికి సేవ చేస్తారు, మేము వారిని గౌరవిస్తాము' అని ఆమె అన్నారు. 'ఆర్మీలో ఉండటం పూర్తి స్థాయి ఉద్యోగం. కానీ అగ్నిపథ్–అగ్నివీర్ (పథకం) దానికి స్వస్తిపలికింది. తాము ఈ పథకానికి వ్యతిరేకంగా నిరసన కొనసాగిస్తాం అని సేన్ చెప్పారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ పాత రిక్రూట్‌మెంట్ విధానం మెరుగైనదని, ఇది సైనికుల భవిష్యత్తుకు, వారి కుటుంబాలకు భద్రత కల్పిస్తుందని అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State,
Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## చిన్నరెడ్డికి ఐఎన్‌టియుసి నేతలు అభినందనలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర బడ్జెట్‌లో గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనకు సంఘం రూ.10 వేల కోట్లు కేటాయించడం పట్ల మున్సిపల్ సూపర్ మజ్దూర్ యూనియన్(ఐఎన్‌టియుసి అనుబంధం) వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్న రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. చిన్నరెడ్డిని కలిసిన వారిలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.



గ్రేటర్ హైదరాబాద్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10 వేల పైచిలుకు కేటాయింపులు జరిపినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని సచివాలయంలో కలిసి నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్లు కలిసి ధన్యవాదాలు తెలిపారు.

## మంత్రి సురేఖను కలిసిన రేణుదేశాయ్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రముఖ నటి, భగవద్గీత ఫౌండేషన్ ఫర్ వేదిక్ స్టడీస్ చీఫ్ అడ్వైజర్ రేణుదేశాయ్ శుక్రవారం జూబ్లీహిల్స్‌లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖను వారింట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పర్యావరణం, వన్యప్రాణుల సంక్షేమం, ఆధ్యాత్మిక రంగాలపై చర్చించారు. భగవద్గీత ఫౌండేషన్ ఫర్ వేదిక్ స్టడీస్ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే ప్రప్రథమంగా నెలకొల్పనున్న గీత యూనివర్సిటీకి సంబంధించిన వివరాలను రేణుదేశాయ్ మంత్రి సురేఖకు వివరించారు. ఈ సందర్భంగా తమఇంటికి అతిథిగా వచ్చిన రేణుదేశాయ్‌ని మంత్రి సురేఖ నూతన వస్త్రాలు, పండ్లు, పసుపు కుంకుమలతో సత్కరించారు. మంత్రి సురేఖ కూతురు కొండా సుస్మిత పటేల్ ప్రత్యేకంగా తెప్పించిన గొలుసును రేణుదేశాయ్‌కి మంత్రి సురేఖ తన స్వహస్తాలతో అలంకరించారు. కొండా కుటుంబం తనను ఆదరించిన తీరు పట్ల రేణు దేశాయ్ ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## ప్రజావాణికి 681 దరఖాస్తులు

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో మొత్తం 681 దరఖాస్తులు అందాయి. ఇందులో రెవెన్యూ సంబంధమైన సమస్యలకు సంబంధించి 69 , పౌరసరఫరాలశాఖకు సంబంధించినవి 132 , విద్యుత్ శాఖకు చెందిన 87, హౌజింగ్‌కు 232,పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 31, ఇతర శాఖలకు సంబంధించి 130 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. బాధితులనుంచి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులను స్వీకరించారు.

## లక్ష్యం మేరకు ట్యాక్స్ వసూలు

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : లక్ష్యం మేరకు ఆస్తిపన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. జోనల్, అదనపు కమిషనర్‌లతో శుక్రవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిఆర్‌ఎంపి ద్వారా చేపట్టిన రోడ్లకు సంబంధించిన ఏజెన్సీలతో చేసుకున్న అగ్రిమెంట్ డిసెంబర్ వరకు గడువు ఉన్నందున పెండింగ్‌లో ఉన్న నిర్వహణ పనులు వెంటనే పూర్తి చేయించాలన్నారు. ఏజెన్సీ ఒప్పందంలో ఉన్న అంశాలకు పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అవసరమైతే ఏజెన్సీలతో జోనల్ స్థాయిలో సమీక్ష చేసి ఒప్పందం చేసుకున్నవిధంగా ఏమైనా గ్యాప్ ఉంటే వెంటనే పనులు చేయించాలన్నారు. డెంగీ వ్యాధి నియంత్రణకు చేపట్టిన అవగాహన కార్యక్రమాలు మరింత ముమ్మరంగా చేపట్టాలని వారికి సూచించారు. దోమలతో వచ్చే వ్యాధులతో పాటుగా ఈగల ద్వారా వచ్చే వ్యాధులపై కూడా అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై నగర వాసులు దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. కమ్యూనిటీ హాళ్ల వివరాలను సర్కిళ్ల వారిగా పూర్తి నివేదిక సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు.

## బోనాలకు ముస్తాబైన దేవాలయాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఈనెల 28న జరగనున్న ఆషాఢం బోనాల జాతరకు ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబు అయ్యాయి. ఇప్పటికే ఆయా ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీలు ప్రత్యేక చొరవ తీసుకొని భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించి ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఆలయ కమిటీ పక్షాన బోనం సమర్పిస్తారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమం కొనసాగుతుంది. అలాగే తొట్టెల, ఫలహారం బండ్ల ఊరేగింపులు ఆలయానికి తరలి వస్తారు.

## పార్కులు సుందరీకరిస్తాం

కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/వనస్థలిపురం : పార్కుల సుందరీకరణ చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడానికి కృషి చేస్తానని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని శ్రీపురం కాలనీలో జరుగుతున్న పార్కు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు పనులు పూర్తిచేసి కాలనీ వాసులకు అందుబాటులో తీసుకోరావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి డీఈ దామోదర్‌రావు, ఏఈ నరేందర్ తేజ, కాలనీ వాసులు శ్రీధర్‌రెడ్డి, విట్టల్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సూర్యవర్ధన్ రెడ్డి, పద్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ముత్యం రావు, ప్రభాకర్‌రెడ్డి, జంగయ్య, పురుషోత్తంరెడ్డి తదితరులు ఉన్నారు.

## బోనాల ఉత్సవాలకు లైట్లు పంపిణీ

కార్పొరేటర్ సుజాత నాయక్



ప్రజాపక్షం/వనస్థలిపురం: బోనాల పండుగ ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా కాలనీల్లో లైట్లు ఏర్పాటు చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లో పలు కాలనీలో బోనాల ఉత్సవాలకు లైట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా బోనాల ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ జగన్నాథం, ఇంజనీరింగ్ ఏఈ హేము నాయక్, నాయకులు గోపి రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు యాదగిరి, హనుమాన్‌నగర్ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, అరుణ్‌రాజ్ ఉన్నారు.

# హైదరాబాద్ మెట్రో 2వ దశ కోకాపేట వరకూ

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణం ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. పాత వాటి స్థానంలో కొత్త ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. మునుపటి ప్రతిపాదనల్లో భాగంగా 5 కారిడార్లలో 70 కిలోమీటర్ల మేర నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. తాజా సవరింపులో అది 78.4 కిలోమీటర్లకు చేరుకుంది. అంచనా వ్యయం కూడా పెరిగి రూ.24,042 కోట్లకు చేరింది. మునుపటి ప్రతిపాదనల ప్రకారం, రాయదుర్గం నుంచి విప్రో కూడలి, యూఎస్ కాన్సులేట్ వరకు 8 కిలోమీటర్ల మేర నిర్మాణాలు చేపట్టాలి. దీన్ని కోకాపేటలోని నియోపోలిస్ వరకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫలితంగా 3.3 కిలోమీటర్ల మేర అదనంగా నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇక అక్కడే మెట్రో డిపో ఏర్పాటు కోసం అధికారులు భూముల పరిశీలన చేశారు. నాగోలు, ఎల్.బి.నగర్, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి కూడలి నుంచి జల్‌పల్లి మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకూ మొదట్లో 29 కిలోమీటర్ల మేర ఎయిర్‌పోర్టు మెట్రోను నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. తాజా సవరింపుతో అది 4 కిలోమీటర్ల మేర పెరిగింది. ఈ కారిడార్‌లో మైలార్ దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్, కొత్త హైకోర్టు వరకూ 5 కిలోమీటర్లకు పైగా మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఇక ఎల్.బి.నగర్ హయత్ నగర్, మియాపూర్‌పటాన్ చెరు, ఫలక్‌నుమా చాంద్రాయణగుట్ట కారిడార్‌లో మాత్రం మార్పులు చేర్పులు చేయలేదు. నాగోలు, ఎల్.బి.నగర్, చాంద్రాయణగుట్టలను మెట్రో ఇంటర్‌ఛేంజ్ స్టేషన్‌లుగా అభివృద్ధి చేయనున్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు : కమిషనర్

ప్రజాపక్షం/నార్సింగి: శుక్రవారం డ్రై డే కార్యక్రమం, శంషాబాద్ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో కమిషనర్ సుమన్‌రావు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులలో పర్యటించారు ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇండ్లల్లో వాడని పాత కూలర్లు, టైర్లు, కొబ్బరి చిప్పలు, రబ్బు రోలు, కుండలు, ఇంటి పైకప్పులో నిలిచిన నీరు తొలగించుకోవాలి మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి సూచించారు, నిల్వనీటితో దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ మలేరియా జ్వరాలు వ్యాపిస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.3,065 కోట్ల కేటాయింపులపై

# జిహెచ్‌ఎంసి సంబరాలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర బడ్జెట్‌లో జిహెచ్‌ఎంసికి రూ. 3,065 కోట్ల కేటాయింపుపై శుక్రవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో పాటు పలువురు కార్పొరేటర్‌లు పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ బాణా సంచకాల్చి, మిఠాయిలు పంచుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్ నగరాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించడం ఆనందంగా హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిహెచ్‌ఎంసికి రూ. 3,065 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జలమండలికి రూ. 3385 కోట్లు కేటాయింపు తో నగరంలో అత్యంత ముఖ్యమైన తాగునీరు, సివరేజి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరం మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మెట్రో విస్తరణ, మూసీ అభివృద్ధి, ఔటర్ రింగ్ రోడ్డు వరకు జిహెచ్‌ఎంసి విస్తరణకు హైడ్రా ఏర్పాటు, నగరాభివృద్ధికి ఎంతో ఉపయుక్తం అవుతుందని మేయర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్‌లు నగరాభివృద్ధికి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

# బంగారు భవిష్యత్తు బలి చేసుకోవద్దు

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రూ. లక్షల జీతాలతో ఉద్యోగాలు, కళాశాల్లో ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు రేవ్‌పార్టీల్లో మద్యం, డ్రగ్స్, ఇతర కార్యక్రమాలకు పాల్పడుతుంటే సభ్య సమాజం ఎటు వెళుతుంది , భావితరాల భవిష్యత్తు ఏమైయిపోతుందనే భయం వేస్తుందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అసాంఘిక కార్యక్రమాల్లో పిల్లలు, భర్తలు, కూతుళ్లు, కుమారులు పాలుపంచుకుంటే తల్లిదండ్రులుగా, కట్టుకున్న ఇల్లాలుగా మీరు ఏమి చేస్తున్నారని వారిని ప్రశ్నించారు. మదాపూర్లో క్లౌడ్ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన రేవ్ పార్టీలో 20మందిపైగా పట్టుబడ్డారు. ఐదుగురిపై కేసు నమోదు చేసివారిని జైలుకు పంపించారు. మిగిలిన యువతి, యువకుల భవిష్యత్తును సరిదిద్దే క్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ సమక్షంలో శుక్రవారం అబ్కారీ భవన్లో కౌన్సిలింగ్ నిర్వహించారు. రేవ్‌పార్టీలో పట్టుబడిన వారిలో ఎనిమిది మంది యువతి, యువకుల తల్లిదండ్రులు, అన్నదమ్ములు సమక్షంలో కమలాసన్‌రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న మీరు ఒక్కపూట సంతోషం కోసం మీ జీవితాలను బలి చేసుకోవద్దని తెలిపారు. అడ, మగ అనే తేడా లేకుండా గంజాయి డ్రగ్స్, మద్యం సేవించడం గోవాకు, పబ్బులకు , రేవ్ పార్టీలకు వెళ్లడం లాంటి వాటికి పాల్పడడం ద్వారా ఏమి సాధించాలని భావించాలని అనుకుంటున్నారని వారిని ప్రశ్నించారు. మీరు మారుతారని ఒక అవకాశ ఇవ్వాలని భావించిన క్రమంలో మీమ్ములను కౌన్సిలింగ్‌కు పిలిపించామని లేకుంటే వెంటనే మీమ్ములను అరెస్టు చేసి జైలుకు తరలించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డితో పాటు ఎక్సైజ్ ఈఎస్ ఎస్ టి ఎఫ్ టీమ్ లీడర్ ప్రదీప్‌రావు, సిబ్బంది సమక్షంలో జరిగిన కౌన్సిలింగ్లో రేవ్ పార్టీ బాధితులు బన్నే శ్రీనివాస్, సుధాకర్ బాబు,తరున్ పడిడాల, దినేష్ అగ్రవాల్, అర్జున్ బండారి, అమిత్ పటేల్, ఏ.సంతోస్ యాదబూవ్,డి.ప్రియదర్శినితోపాటు వారి తల్లిదండ్రులు,అన్నయ్యలు, ఇతరులు హాజరయ్యారు. మిగిలిన వారికి ఈ నెల 30న కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఈఎస్ ప్రతి ప్రదీప్ రావు తెలిపారు.

# తగ్గిన 'గొర్రెలు, మేకలు'

మేడ్చల్, వరంగల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీస్థాయిలో తగ్గింపు

గద్వాల, వనపర్తిలో అతి తక్కువగా నమోదు

'పథకం'పై మరింత అనుమానాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పశుగణనలో గొర్రెలు, మేకల సంఖ్య తగ్గింది. 2019 నుంచి 2024 జూన్ 30 వరకు సేకరించిన పశుగణన లెక్కల ప్రకారం 32.40 శాతం గొర్రెలు, మేకలు తగ్గినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దీంతో గత ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం పట్ల మరింత అనుమానాలు కలుగుతున్నాయి. గొర్రెల పంపిణీ పథకంలో అవకతవకలు జరిగినట్టు ఇటీవల కాగ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 2019లో గొర్రెలు, మేకలు మొత్తం కలిపి 2,39,88,070 ఉండగా, ప్రస్తుత ఏడాది జూన్ 30 వరకు 1,62,16,908 ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. తాజా లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా మేడ్చల్‌లో 60.49 శాతం, వరంగల్‌లో 60.15 శాతం, సంగారెడ్డిలో 53.26 శాతం, మెదక్‌లో 50.46 శాతం, అతి తక్కువగా మంచిర్యాలలో 13.82 శాతం, జోగులాంబ గద్వాలలో 9.51 శాతం, వనపర్తి జిల్లాల్లో 7.29 శాతం గొర్రెలు, మేకల సంఖ్య నమోదైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితన తర్వాత గత ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని గొల్ల, కుర్మలను కోటీశ్వరులను చేస్తామని తెలిపింది. ఈ పథకంలో భాగంగా 25 శాతం లబ్ధిదారుల వాటాను నిర్ధారించింది. 2017 సంవత్సరంలో సుమారు 3.5 లక్షల యూనిట్లను పంపిణి చేసింది. (ఒక్కో యూనిట్‌లో 25 గొర్రెలు). ఆ తర్వాత 2019లో రెండవ దశ గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టగా ఇందులో పూర్తి స్థాయిలో గొర్రెల యూనిట్లను పంపిణీ చేయలేదు.అయితే రెండో విడతలో భాగంగా సుమారు 85,488 మంది తమ వాటా 25 శాతం నిధులను డిడి రూపంలో చెల్లించారు. దీంతో దాదాపు రూ. 430 కోట్లు జిల్లా కలెక్టర్ల ఖాతాల్లోనే నిధులు ఉన్నాయి. మరో 2,20,792 మంది లబ్ధిదారులు ఇంకా డబ్బులు కూడా చెల్లించలేదు. లబ్ధిదారుల్లో సుమారు 40 శాతానికి పైగా గొర్రెల పంపిణీ జరగలేదని మేకల,గొర్రెల సంఘం వర్గాలు పేర్కొన్నాయి.

## చిన్నారులకు వ్యాక్సిన్ వేయించాలి

మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి



ప్రజాపక్షం/యాచారం : మొదడు వాపు (జెఈ ) టీకాను 9 నెలల నుండి 15 ఎండ్లు ఉన్న చిన్నారులకు తప్పకుండా వేయించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం యాచారం మండల పరిధిలోని గున్‌గల్ మోడల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 277 మంది, మహాత్మా జ్యోతి రావుపూలే సాంఘీక సంక్షేమ హాస్టల్‌లో 950మంది ,కెజిబివి యాచారంలో 210 మంది, మొత్తం 1588 మంది పాఠశాల విద్యార్థులకు జెఈ టీకాను వేయడం జరిగింది. ఈ సంధర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మెదడు వాపు టీకాను తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 25 నుండి ఆగస్టు వరకు మండలంలోని అన్ని ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాలల్లో, హాస్టల్స్‌లో, అంగన్‌వాడి కేంద్రాల్లో వేయడం జరుగుతుందన్నారు. అంగన్ వాడి కేంద్రాల్లో 9 నెలల నుండి 5 సంవత్సరాల పిల్లలకు అయా కార్యక్రమంలో అసుపత్రి సూపర్ వైజర్స్, ఎఎన్‌ఎంలు,అశా వర్కర్లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం: భారత కమ్యూనిస్టు పార్టీ ఇబ్రహీంపట్నం యాచారం మంచాల మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పార్టీ బలంగా ఉన్న అన్ని గ్రామాలలో పోటీ చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు స్థానిక సంస్థల ఎన్నికల మీద దృష్టి పెట్టి ప్రజా సమస్యల మీద పోరాటం చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే వాటిని ఎండగట్టి ప్రజలకు దగ్గరగా ఉండాలని ఆయన కార్యకర్తలను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కంటే ముందు ఇచ్చిన వాగ్దానాలన్నిటిని త్వరలోనే నెరవేర్చాలని లేని పక్షంలో పార్టీ ప్రజా పోరాటలకు సిద్ధం అవుతుందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్ర చారి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కావలి నరసింహ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ప్రాంతంలో పార్టీని మరింత ముందుకు తీసుకుపోవడానికి పార్టీని గ్రామ గ్రామాన కమిటీలు వేసి ప్రజలకు మరింత దగ్గర కార్యకర్తలు కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాది రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యురాలు పోచమోని నీలమ్మ, సిపిఐ సీనియర్ నాయకులు శివరాల లక్ష్మయ్య, చివరాల యాదయ్య, జంగిలి కృష్ణ, ములుగు నరసింహ, నీలం శివయ్య, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మూడు మండలాలకు సంబంధించి కార్యదర్శులు సహాయ కార్యదర్శిలను నియమించారు. ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శిగా ములుగు నరసింహ.మంచాల మండల కార్యదర్శిగా రాజు నాయక్, సహాయ కార్యదర్శులుగా మేకల రామకృష్ణ, గాలయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాచారం మండల కన్వీనర్ గా నీలం శివయ్య కోకన్వీనర్ గా మస్కు సంజీవులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# బడ్జెట్‌పై విమర్శించే నైతిక హక్కు బిఆర్‌ఎస్‌కు లేదు

బిఆర్‌ఎస్ నేతల విధానంపై మండిపడిన కాంగ్రెస్ శ్రేణులు



ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రజా శ్రేయస్సు కోసం ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్‌పై విమర్శించే నైతిక హక్కు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు లేదని కాంగ్రెస్ ఎస్‌టి సెల్ రాష్ట్ర నాయకుడు రఘునాయక్, మైనార్టీ నేత మహ్మద్ బాబర్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కలు బడ్జెట్‌ను ప్రవేశపెట్టితే అభినంధించాల్సింది పోయి విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం వ్యవసాయ రంగానికే రూ.72.659కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం జరిగిందని వివరించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఈ స్థాయిలో నిధులు కేటాయించలేదని, ఈ విషయంలో ప్రతిపక్ష నేతలు అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఏకకాలంలో రుణమాఫీ చేయడంతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందని వివరించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్నదాతలు ఏ స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొన్నారో అందరికి తెలుసనే విషయాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. సబ్బండ వర్గాల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ ప్రవేశపెడితే పక్కదారి పట్టించేందుకు ప్రతిపక్ష నేతలు, మాజీ మంత్రులు హరీష్‌రావు, కెటిఆర్‌కు కుట్రలు చేయడం సరికాదని హెచ్చరించారు. పదేళ్ళ కాలంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఏమి ఒకగబెట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు. విమర్శలు చేయడం మాని అభివృద్ధి, పంక్షేమానికి సహకరించాలని సూచించారు.

### ప్రొసీడింగ్స్ ఇచ్చారు..నిధులు చెల్లించడం మరిచారు

షాద్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి గత పాలకులు ప్రొసీడింగ్స్ ఇచ్చారే తప్పా నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులు సగం వరకు చేసి కాంట్రాక్టర్ నిలిపివేస్తే స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టించారన్నారు. కొత్తూరు వై జంక్షన్ నుండి బ్రిడ్జి వరకు రోడ్డును నాలుగు లైన్లు చేయాలని శంకుస్థాపనలు చేయడంతోపాటు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. నిధులు ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే వదిలేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో నేతలు బస్వం అప్ప, చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, లింగారెడ్డిగూడ అశోక్, సీతారాములు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాపక్షం/రాజేంద్ర నగర్: రాజేంద్ర నగర్ సర్కిల్ మైలార్‌దేవ్ పల్లి డివిజన్ మధుబన్ కాలనీ, పద్మశాలి పురంలో జరుగునున్న బోనాల పండుగను పురస్కరించుకొని దేవాలయ పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న పనులను స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. వర్షాకాలన్నీ దృష్టిలో ఉంచుకొని భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బోనాల పండుగ ఉత్సవాలను పురస్కరించుకుని జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎక్కడ కూడా పనులను నాణ్యత లోపాలు లేకుండా సకాలంలో నిర్ణీత సమయానికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. శానిటేష్, వీధీ దీపాల మరమత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలనిసూచించారు.ప్రజలందరు శాంతి యుత వాతవరణంలో బోనాల పండుగ ఉత్సవాల సంబరాలను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసీ ఏఈ నరసింహామూర్తి, వర్క్ ఇన్స్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్ వైజర్ వినయ్, ఎస్‌ఎఫ్ఐ జాషువా, స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి,నరిసంహారెడ్డి, ఎల్‌వి రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజ్ కుమార్, అవినాష్, మల్లికార్జున్, జిహెచ్‌ఎంసి సిబ్బంది, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.





## రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ పట్టణంలోని పలుయ కాలనీలో మహబూబ్‌నర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఉ రోజు పలు కాలనీల్లో పర్యటించారు .ఈ సందర్భంగా అప్పనపల్లి మూడో వార్డులో పర్యటన సందర్భంగా ప్రజలు అప్పన్న పల్లి నుంచి ఎదిర్కు అను సంధానంగా ఉన్న రోడ్డు ను ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు .వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు కోసం ఎస్టిమేషన్ చేయమని మున్సిపాల్ చైర్మన్ ఆదేశాల జరిచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మూన్సిపాల్ చైర్మన్ ఆనంద్ గౌడ్,కౌన్సిలర్ రామాంజనేయుల ,మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి ,డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ ,లక్ష్మ ణ్ యాదవ్ ,తిరుమల వెంకటేష్, నాల్గో వార్డు మాజీ కౌన్సిలర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కులవృత్తులకు తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్ సర్కార్

### మాజీ వైస్ ఎంపిపి వెంకటాచారి

**ప్రజాపక్షం/బాలానగర్ :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 202425 అన్ని రకాల కులవృత్తులను పట్టించుకోకుండా బడ్జెట్లో వివక్షత చూపించి తీవ్ర అన్యాయం చేశారని బాలానగర్ మండల మాజీ వైస్ ఎంపీపీ వడ్ల వెంకటాచారి ఆరోపించారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక పత్రిక ప్రకటనలో పేర్కొంటూ ఆసరా పెన్షన్స్, దళితులకు, గోల కుర్మలకు ముదిరాజు తదితర కులాలకు అన్యాయం చేశారని అన్నారు. దళిత బంధును 10 లక్షలు మాజీ సీఎం కెసిఆర్ ఇస్తే కాదు మేము దళితులకు 12 లక్షలు ఇస్తామని ఎన్నికల్లో ఓటు వేయించుకుని బయటపడ్డాక ప్రజలను విస్మరిస్తున్నారని విమర్శించారు. బడ్జెట్లో ఎక్కడ దళిత బంధుపథకం గురించి ప్రస్థానం లేదని అన్నారు. గొల్ల కుర్మలకు ఆర్థికంగా బాగుపడాలని కెసిఆర్ పథకం తీసుకోస్తే ఎలాంటి మాట లేని బడ్జెట్ అని, వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్స్ పెంచుతారని అనుకున్నారని, కానీ వాళ్లకు కూడా పెంచడానికి ఎక్కడ మాట్లాడలేదని పేర్కొన్నారు. బడ్జెట్లో బీసీ వాళ్లకు కులవృత్తుల పేరిట లక్ష రూపాయలు ఇచ్చామని ఆలోచించిన కెసిఆర్ ని కాదని కాంగ్రెస్ కి ఓట్లు వేసినందుకు వారికి అన్యాయం చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పేరిట 20 వేల కోట్లు పెడుతామని చెప్పి కేవలం 7 వేల కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. ఫ్రీ బస్సు కాదు, 200 రూపాయల కరెంటు కాదు, 500 రూపాయల సిలిండర్ కాదు జిల్లాలో ఉన్న పాలమూరు ఎత్తిపోతల పథకానికి నిధులు కావాలని, ఉదండపూర్ ప్రాజెక్టుని పూర్తి చేయాలని డిమాండు చేశారు.




## జ్యువెలరీ షాప్‌లో చోరీ

**ప్రజాపక్షం/బాలానగర్ :** బాలానగర్ మండలంలో మరోసారి భారీ చోరి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలానగర్ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల కృష్ణ జ్యువెలరీ షాప్ లో గురువారం అర్ధరాత్రి దొంగలు చోరికి పాల్పడ్డారు. గురువారం అర్ధరాత్రి ఒకటిన్నర రెండు గంటల ప్రాంతంలో హైవే పైన రాందేవ్ బాబా కిరాణం ముందు గల ఓమ్ని వాహనాన్ని దొంగిలించి, అక్కడి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డులో గల కృష్ణా జువెలరీ షాప్ దగ్గరికి వచ్చి అక్కడ వాహనాన్ని నిలిపి, కట్టర్ సహయంతో షట్టర్ యొక్క తాళాలు కత్తిరించి, గుణపాలతో షట్టర్ ఓపెన్ చేయడం జరిగిందని సిఐ నాగార్జున గౌడ్ తెలిపారు. జువెలరీ షాప్ యజమాని కేశారం చౌదరి కంప్లైంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. 10 కిలోల వెండి, రెండు తులాల బంగారు అభరణాలు చోరికి గురైనట్లు తెలిపారు. అలాగే దొంగిలించిన ఓమ్ని వాహనాన్ని రాజాపూర్ దగ్గరలో గల మరుధర్ రాజస్థాని దాబా దగ్గర వాహనం నిలిపి అక్కడి నుంచి పారారైనట్లు ఆయన తెలిపారు. క్లూస్ టీం వారు వచ్చి సంఘటన స్థలంలో వేలిముద్రలు, ఆధారాలు సేకరించినట్లు తొందరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. చోరికి గురైన జువెలరీ షాప్‌ను జిల్లా ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ నాగార్జున గౌడ్, ఎస్ఐ తిరుపాజి స్పష్టం చేశారు.



## అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 21 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన స్పష్టం చేశారు. నిన్న ప్రవేశపెట్టిని బడ్జెట్లో కూడా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లకు అత్యధిక నిధులు కేటాయించారని ఆయన గుర్తు చేశారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయలేని కేటాయింపులు వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 72 వేల కోట్లు కేటాయించడం, రైతులను రుణ విముక్తులను చేసిన రేవంత్‌రెడ్డి కి మనమంతా రుణపడి ఉన్నామని సంక్షేమానికి, 47 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం మైనార్టీలకు వెనుకబడిన తరగతులకు అత్యధిక నిధులను కేటాయించి వారి అభ్యున్నతికి కృషి చేస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఎప్పుడైనా మీ సమస్యలను మా దృష్టికి , క్యాంపు కార్యాలయానికి రావచ్చు అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సుందర్ రాజ్, నయాబ్ తాహసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖద్రి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లు నర్సింహరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సిజె బెనహర్, బుద్దారం సుధాకర్ రెడ్డి, గోవిందు, ధర్మాపూర్ నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాజు గౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇఎస్ఐ సేవలు విస్తరించేందుకు చర్యలు

### ఇఎస్ఐ డైరెక్టర్ జనరల్‌తో సింగరేణి సిఎండి భేటీ

### సింగరేణి ప్రాంతంలో ఇఎస్ఐ ఆసుపత్రుల ప్రారంభానికి వినతి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సౌకర్యార్థం కార్మిక రాజ్య బీమా సంస్థ (ఇఎస్ఐ) సేవలను సింగరేణి ప్రాంతంలో విస్తరింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ కమల్ కిషోర్ సోన్‌ను సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ కోరారు. ఢిల్లీలో గురువారం ఆయన ఇఎస్ఐ డిజిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. సింగరేణి వ్యాప్తంగా 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలియజేశారు. కాంట్రాక్టు ఉద్యోగులకు కంపెనీ తరఫున వైద్య సేవలు అందిస్తున్నామని... అయితే వారి కుటుంబ సభ్యులకు కూడా సేవలు అందించాలని విజ్ఞప్తులు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి వీలుగా తొలుత కొత్తగూడెం, సింగరేణి థర్మల్ ప్లాంట్ లో ఈఎస్ఐ ఆసుపత్రులను ప్రారంభించి సేవలను ప్రారంభించాలని కోరారు. వీలైనంత త్వరగా ఈఎస్ఐ సేవలు ప్రారంభించేందుకు సింగరేణి తరఫున మౌలిక సదుపాయాలైన క్వార్టర్లను కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ డిజి మాట్లాడుతూ.. తొలుత ఈఎస్ఐ డిస్పెన్సరీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని.. అవసరం మేరకు ఆసుపత్రులుగా మార్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలోని ఈఎస్ఐ అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సింగరేణిలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు అందరూ కూడా ఇఎస్ఐ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని, వారిని, వారి వద్ద పనిచేస్తున్న కార్మికుల వివరాలను కూడా ఈఎస్ఐలో నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు. సింగరేణి ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన ఈఎస్ఐ డీజీకి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈఎస్ఐ ఆసుపత్రులతో కాంట్రాక్టు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు లభించే ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు తమవంతుగా చర్యలు తీసుకుంటామన్నారు.

# పరిశుభ్రతతోనే అంటు వ్యాధుల నివారణ



**ప్రజాపక్షం / పాన్‌గల్ :** పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతతోనే అంటూ వ్యాధులు దరిచేరకుండా నివారించుకోవచ్చని హెల్త్ అసిస్టెంట్‌లు రాంచందర్ , శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా పాన్‌గల్ మండల పరిధిలోని కేతేపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పర్యటించారు. కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గునియా, వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి ఒకసారి ఇంటిలోని మంచినీటి వనరులను నీటితొట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని పాత నీటిని పారబోసి కొత్త నీటిని పట్టుకోవాలన్నారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, నివాస పరిసరాల్లో వాడి పడేసిన కొబ్బరిబొండాల్లో వాడని ప్లాస్టిక్ డ్రమ్ముల్లో, పూల కుండీల్లో, నిల్వ చేసిన పాత టైర్లల్లో , ఎయిర్ కూలర్లలో పగిలిన మట్టికుండల్లో, మట్టి చిప్పల్లో వాడని రుబ్బరోళ్లలో నిల్వ నీరు లేక వర్షపు నీరు చేరడం వలన వీటిలో దోమల సంతతి పెరిగి మనుషులను కుట్టడం వలన కీటక జనిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పరుశరాముడు, కారోబర్ ఆంజనేయులు, ఆశ కార్యకర్తలు చినమ్మ, సంధ్య, కవిత, ప్రమీల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



## పెండింగ్ డిఎలతో పాటు పిఆర్‌సి ఫిట్మెంట్ ప్రకటించాలి

**ప్రజాపక్షం / పెద్దమండడి :** తపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శుక్రవారం పెద్దమండడి మండలంలోని వివిధ ఉన్నత ప్రాథమిక ప్రాథమికొన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, పెద్దమండడి మండల ఇంచార్జీ నర్మద , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరప్రసాద్ గౌడ్ , జిల్లా ఉపాధ్యక్షులు మనోహర్ గౌడ్ , జిల్లా మీడియా కన్వీనర్ శశివర్ధన్ ,పెద్దమండడి మండల అధ్యక్షులు అశ్విని రవికుమార్ , ప్రధాన కార్యదర్శి పి. రవికుమార్ , జిల్లా ఏవా కన్వీనర్ ఈశ్వర్ వెంకటస్వామి తదితర తపస్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 5 డిఏలతో పాటు పిఆర్సి ఫిట్మెంట్‌ను ప్రకటించాలని కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్‌ను అమలు చేయాలని , బిఈడి చేసిన ఎస్‌జిటి ఉపాధ్యాయులకు కూడా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా అవకాశం కల్పించాలని స్కూళ్లలో స్కావెంజర్లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.

## మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మూసాపేట మండలంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మూసాపేట మండలంలో పర్యటించారు. మండల మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి కార్యక్రమం ద్వారా బ్యాంక్ , స్త్రీ నిధి ద్వారా రుణం అందజేసి మహిళా క్యాంటీన్‌ను త్వరగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.మహిళా శక్తి క్యాంటీన్‌లో అవసరమైన సామాగ్రి కొనుగోలుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట డిఆర్డీఓ నర్సిములు, డిపిఎం నాగ మల్లిక, ఏపిఎం వెంకటాచారి పాల్గొన్నారు.

## బోలెరో బైక్ ఢీ కొని యువకుడు మృతి



**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి :** బోలెరో బైక్ ఢీ కొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. శేర్‌పల్లి గ్రామానికి చెందిన సాయితేజ బూర్గుపల్లి గ్రామం నుంచి వ్యవసాయ పొలంలో వరినాటు వేయడానికి కూలీలను తీసుకొని రావడానికి వెళ్తుండగా జడ్చర్ల నుంచి ఎదురుగా వస్తున్న బోలెరో వాహనం భూత్పూర్ మున్సిపాల్టీ కేంద్రంలోని సాహితి స్కూల్ దగ్గర ఎన్ హెచ్ 44 జాతీయ రహదారిపై బైక్ ను ఢీ కొనడంతో సాయితేజ తలగా తీవ్రంగా గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం సాయితేజ మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రభుత్వం కేటాయించిన ప్రతి పైసా దళిత సంక్షేమానికి ఖర్చు చేయాలి

### మారుపాక అనిల్ కుమార్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించిన ప్రతి పైసా చిత్తశుద్ధితో దళిత సంక్షేమానికి ఖర్చు చేయాలని ,రాజకీయాల కతీతంగా పారదర్శకంగా ప్రతి పైస ఖర్చు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్ ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శాసన సభలో 202425 సంవత్సరానికి గాను రాష్ట్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ లో సంక్షేమాన్ని విస్మరించారన్నారు. రాష్ట్రంలో దళితులు 18 శాతం ఉన్నారని , రాష్ట్ర బడ్జెట్ రూ. 2.91,159 లక్షల కోట్లలో 18 శాతం నిధులు ఎస్సి ఎస్‌డిఎఫ్ ప్రకారం కేటాయింపు చేయాల్సి ఉండగా 2,82,74 కోట్లు ( 14.86 శాతం నిధులు ) మాత్రమే కేటాయించారన్నారు. ఆ నిధులు కూడా ఖర్చులకు నోచుకోవట్లేదని అన్నారు. గత ప్రభుత్వం కూడా కేవలం కేటాయింపులతో గొప్పలు చెప్పుకుందని అన్నారు. దళితుల బడ్జెట్ ను కాళేశ్వరం ప్రాజెక్ట్ మిషన్ భాగీరథ మిషన్ కాకతీయ వంటి వాటికి దారి మళ్లించిందని ఆరోపించారు. ఆరోపించారు. రాష్ట్రంలో 18 శాతం ఉన్న దళితులకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి వారి మౌలిక సంక్షేమానికి ఖర్చు పెట్టగలిగితే దళితులకు కొంత ఊరట లభిస్తుందని మారుపాక అనిల్ కుమార్ తెలిపారు.



## న్యాయం చేస్తా : ఎమ్మెల్యే యెన్నం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన పలువురు ట్రాన్స్‌జెండర్స్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ల న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం వారు ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే కి వినతిపత్రం సమర్పించిన వారిలో ట్రాన్స్‌జెండర్స్, అఖిల, వెన్నెల, గీత తదితరులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలో ఉన్న ఎస్టిబాలికల హాస్టల్‌చుట్టూ ప్రహరీగోడ నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను రాష్ట్రప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని శుక్రవారం పిడిఎస్‌యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పిడిఎస్‌యు రాష్ట్రనాయకులు సంతోష్ మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రంలో దాదాపు 8వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లోఉన్నాయని ప్రభుత్వం స్పందించి స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, వెల్దండ మండలకేంద్రంలో ఎస్‌టిబాలికల హాస్టల్‌చుట్టూ ప్రభుత్వజూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీగోడ నిర్మించాలని, విద్యార్థులకు మధ్యాహ్నబోజనం పెట్టాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాహుల్, అర్జున్, నితిన్, పవన్, అనిల్, మల్లేష్, శుక్లాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట పట్టణానికి చెందిన దారమోని ప్రవీణ్ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు పి. నవీన్ రెడ్డి, నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన నాగం రాంరెడ్డిని సంప్రదించి వారు అందించిన రూ. 5వేలు , వంట సామాగ్రిని, వైద్య పరికరాలను ప్రవీణ్ కుటుంబానికి అందజేశారు.

## కేంద్ర రాష్ట్రాలకు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నకిలీ పురుగు మందల అమ్మకాలను అంతం చేసేందుకు తీసుకున్న చర్యలు తెలియజేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ)లను ఆదేశించింది. నకిలీ, కల్తీ మందుల అమ్మకాలు అరికట్టడంలో అధికారులు వైఫల్యం చెందారంటూ సంగారెడ్డిలోని లాయర్ రవికృష్ణ వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

## కౌంటర్ దాఖలు చేయండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం నిబంధనల మేరకు రాష్ట్ర అథారిటీ, జిల్లా కమిటీలను ఏర్పాటు చేయలేదంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్, డైరెక్టర్ అండ్ పబ్లిక్ హెల్త్, ప్రభుత్వ మానసిక వైద్యశాఖ సూపరింటిండెంట్‌కు నోటీసులిచ్చింది. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 నిబంధనలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని, ఎనిమిది లక్షల మంది మానసిక ఆరోగ్య బాధితుల్లో అత్యధికులు దళిత, బడుగు,బలహీన వర్గాలేనని, దేశవ్యాప్తంగా బాధితుల సంఖ్య 6 కోట్లకుపైనేనంటూ లాయర్ రాపోలు భాస్కర్ రాసిన లేఖను హైకోర్టు పిల్‌గా మార్చింది. చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చి విచారణను వాయిదా వేసింది.

## ఆ నిబంధన రద్దు చేయండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లాయర్లు సమర్పించే సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీవోపీ)తో పాటు 5 వకాలత్‌లను కూడా సమర్పించాలనే షరతును రద్దు చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ)ను స్టేట్ బార్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది. బిసిఐ గత జనవరి 14న రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు జారీ చేసిన సర్క్యులర్‌ను వ్యతిరేకిస్తూ న్యాయవాదుల వినతిని పరిశీలించాలని కోరింది. ఐదు వకాలత్‌లు ఇవ్వకపోతే లా సంస్థలు నుంచి సర్టిఫికెట్ తీసుకుని ఇవ్వాలనే షరతును రద్దు చేయాలని స్టేట్ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా బీసీఐని కోరారు.

## స్మీతాసబర్వాల్ వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం : కోదండరామ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దివ్యాంగులు కొన్ని ఉద్యోగాలకు పనికిరారని ఐఎఎస్ అధికారి స్మీతా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని టిజెఎస్ అధ్యక్షుడు ఎం.కోదండరామ్ అన్నారు. చట్టాలను అమలు చేయాల్సిన ఐఎఎస్ అధికారి వైకల్యాన్ని కించపర్చడం సమంజసం కాదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్మీతా సబర్వాల్ తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోగా సమర్థించుకోవడం శోచనీయమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు ఎవ్వరూ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. వైకల్యం పేరుతో వారి హక్కులను హరించడం సరైంది కాదని, ఎంతో మంది దివ్యాంగులు ఉన్నత శిఖరాలను అధిరోహించారని కోదండరామ్ గుర్తు చేశారు.




## నేటి నుంచి భారత్ ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్

### అపోలో హాస్పిటల్స్ కార్డియాలజీ, క్లినికల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గుండె సమస్యలపై అవగాహన కోసం భారతదేశ ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్ శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అపోలో హాస్పిటల్స్ కార్డియాలజీ, క్లినికల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ వివరాలు వెల్లడించేందుకు హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపోలో హాస్పిటల్స్, కార్డియోవాస్కులర్ రీసెర్చ్ ఫౌండేషన్, (సీఆర్ఎఫ్) యూఎస్ఏతో కలిసి ఫ్యాకట్స్ ఫౌండేషన్ ఈ మూడు రోజులు 'టిసిటి ఇండియా 2024' భారతదేశపు ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్ ను హైదరాబాద్లోని హెచ్ఐసిసిలో నిర్వహించనుందని చెప్పారు. దేశ, విదేశాల నుంచి కార్డియాలజిస్టులు, కార్డియోథొరాసిక్ సర్జన్లతో కూడిన 1200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. భారతదేశం నుంచి 100 మంది, విదేశాల నుంచి 30 మంది అధ్యాపకులు ఇంటర్వెన్షనల్ కార్డియాలజీలో తాజా పురోగతులు ప్రతినిధులకు తెలియజేయనున్నారని తెలిపారు. ఇది అతిపెద్ద ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టుల సదస్సు అన్నారు. దీనికి దేశ, విదేశాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. గుండె సంబంధిత సమస్యలను ఎదుర్కొనేందుకు ఇంతవరకు అవసరమైన కార్డియాక్ సర్జరీకి అనేక ప్రత్యేక పద్ధతులు కలవన్నారు.



## డిఇఓ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్లో నాగర్‌కర్నూల్ డిఇఓ గోవిందరాజులు ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా పాఠశాలలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1300వందలమంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని, 530మంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు వివిధదశలో పదోన్నతులు పొందారని అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం త్వరలో చేపట్టే డిఎస్సి ద్వారా 250 ఉపాధ్యాయపోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆయనవెంట ఇంచార్జీ ఎంఈవో శంకర్‌నాయక్, ప్రిన్సిపాల్ పుష్పలత, వైస్‌ప్రిన్సిపాల్ రాధాకృష్ణలు ఉన్నారు.



## దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని జాజాల గ్రామానికిచెందిన కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపిటిసి కొండల్‌రెడ్డి తండ్రి దశదినకర్మలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని గోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. పరామర్శించినవారిలో మాజీసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శంకర్‌యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జానీపాష ఉన్నారు.



## వసతిగృహాల విద్యార్థుల చదువుపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** వసతిగృహాల విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం, చదువుపట్ల ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని జిల్లాకలెక్టర్ బదావత్‌సంతోష్ సూచించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని వెనకబడిన తరగతుల బాలుర సంక్షేమ వసతిగృహాన్ని కలెక్టర్ బదావత్‌సంతోష్ అదనపు కలెక్టర్ సీతారామారావుతోకలిసి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతోకలిసి హాస్టల్ తరగతిగదులను పరిసరాలను , వంటగదిని పరిశీలించి, వార్డెన్‌సిబ్బంది వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్‌రాత్రి సమయంలో హాస్టల్లో బసచేస్తాడా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. కిచెన్, డైనింగ్‌హాల్, స్టోర్‌రూమ్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. వసతిగృహంలో విద్యార్థుల గదులను పరిశీలించారు. 8,9,10 తరగతుల విద్యార్థులు ఏపాఠశాలలో చదువుతున్నారు, ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ బోజనంచేశారు. విద్యార్థులకు రుచికరమైన బోజనాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్లు, కంపౌండ్‌వాల్ తదితర అంశాలను ఈఈపిఆర్‌ద్వారా పనులను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు బాగాచదువుకొని ఉన్నతస్థానంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కలెక్టర్‌వెంట తహసీల్దార్ ఇబ్రహీం ఉన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని విద్యానగర్‌లో 10 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని, సమయానికి పూర్తి చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ దీపక్, వర్క్ ఇనస్పెక్టర్ రమేష్, బిజెపికి చెందిన సంతోష్, నందు యాదవ్, మురళీ గౌడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సిఎంఆర్ డెలివరీ సకాలంలో పూర్తి చేయాలి

### వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మండల పరిధిలోని వెంకటరమణ రైస్ మిల్లును అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానాకాలం సీజన్ 2023–24 ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ బియ్యం ను రోజువారి గా లక్ష్యాన్ని నిర్దేశించి ఆగస్టు నెల 15 తారీకు లోపు మిల్లర్లు డెలివారీ చేయాలని అదేశించారు. డిఎం ,డిటి నిరంతర పర్యవేక్షణ జరిపి త్వరితగతిన సిఎంఆర్ టార్గెట్స్ పూర్తి చేయాలని అదేశించారు. త్వరగా ఎఫసిఐకి డెలివరీ చేయాలని ఆదేశించారు. సుగుణ బాయి తదితరులు పాల్గొన్నారు.

## దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల నిందితుడు మృతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసు నిందితుడు ఇండియన్ ముజాహిద్దీన్ ఉగ్రవాది సయ్యద్ మక్బూల్ (52) చికిత్స పొందుతూ గాంధీ ఆసుపత్రిలో గురువా రం ఉదయం మృతి చెందాడు.పోలీసులు తెలిపిన ప్రకారం దిల్‌సుఖ్ నగర్ బాంబు పేలుళ్లు ఘటనతో పాటు పలు రాష్ట్రాలలో పేలుళ్లతో సంబంధం ఉండడంతో ఢిల్లీ జైలులో శిక్ష పొందుతున్నాడు.8 నెలల క్రితం ఓ కేసు విషయంలో హైదరాబాద్‌కు తీసుకురాగ చర్లపల్లి జైలులో ఖైదీగా ఉన్న మక్బూల్ గత రెండు నెలల క్రితం బైపాస్ సర్జరీ,కంటి సమస్య,లోబిపితో పాటు అనారోగ్యంతో నిమ్స్,గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని అధికారులు తెలిపారు.

## మాదక ద్రవ్యాలు వద్దు...ఉన్నత శిఖరాలే ముద్దు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మాదక ద్రవ్యాలు, గంజాయిలకు బానిసలు కావద్దని, భవిష్యత్తు పాడు చేసుకోవద్దని, నేరేడ్‌మెట్ పోలీసులు శుక్రవారం సిఐ సందీప్‌కుమార్ ఆదేశాలతో సంతోషిమానగర్ ఎక్స్ రోడ్‌లో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదక ద్రవ్యాలు అమ్మినా, సేవించినా చట్ట ప్రకారం కఠిన శిక్షకు గురవుతారన్నారు. ఉన్నత ప్రమాణాలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులు గర్వపడేలా ఉండాలన్నారు.

## నేడు కొడంగల్‌కు అసదుద్దీన్ ఒవైసి

**ప్రజాపక్షం / కొడంగల్ :** నేడు కొడంగల్ నియోజకవర్గానికి ఏఐఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసి వస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్‌బి గుల్షన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు కొడంగల్ పట్టణంలోని బసిరెడ్డి పంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పబ్లిక్ మీటింగ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలతో మూలాఖత్ అయ్యేందుకు వస్తున్నట్లు అందుకు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ముస్లీం సోదరులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలి

### శామీర్‌పేట ప్రత్యేకాధికారి సైదులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని శామీర్‌పేట మండల ప్రత్యేకాధికారి సైదులు అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలం లాల్‌గడిమలక్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెదడు వాపు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రత్యేకాధికారి సైదులు మాట్లాడుతూ మెదడు వాపు వ్యాధి సోకకుండా ప్రతి విద్యార్థికి టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలోని నర్సరీని సందర్శించి పలు సూచనలు చేశారు. హరిజన వాడలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రాల్లో చదువుకునే చిన్నారులకు పౌష్టికాహారాన్ని సమయానికి అందించాలని సూచించారు. గర్భిణిలకు, తల్లులకు, పిల్లలకు పోషకాహారం అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో మమత బాయి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ప్రదానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ప్రభాకర్, డాక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## జిహెచ్ఎంసి మల్కాజిగిరి కార్యాలయం ఎదుట ధర్నా

### సమస్యల పరిష్కారానికి బిసి కులాల ఐక్యవేదిక డిమాండ్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బిసి కులాల ఐక్య వేదిక అధ్యక్షులు కామల్ల ఐలన్న డిమాండ్ చేసారు. జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం ఎదుట శుక్రవారం బిసి కులాల ఐక్య వేదిక ఉపాధ్యక్షులు బత్తిని నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో బిసి కులవర్గాలు, స్థానికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలన్న మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా అంటు వ్యాధులు సోకకుండా దోమల నివారణ కోసం క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, వీధి కుక్కల బెడద లేకుండా చూడాలని, వర్షాలతో రహదార్లపై ఏర్పడిన గుంతలను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయాలని, పగిలి పోయిన డ్రైనేజి పైపుల నుండి రోడ్లపై పారకుండా చూడాలని, బస్తీ దవఖానాల్లో మందులు, సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చూడటంతో పాటు దవఖానాల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సర్కిల్ డిప్యూటి కమిషనర్ రాజుకు సమర్పించారు. ఈ ధర్నాలో బిసి కులాల నాయకులు రొయ్యల కృష్ణమూర్తి, పిట్టల శ్రీనివాస్, వంశీ ముదిరాజ్, శ్రీనివాసగౌడ్, రమేష్‌గౌడ్, నర్సింహగౌడ్, కాసర్ల నాగరాజు, చేగూరి రామ్‌మోహన్, నవీన్ నేత, సాంబరాజు ముదిరాజ్, భాస్కర్, సుధాకర్, కె.జయలక్ష్మి , లక్ష్మి నారాయణ, పర్వతాలు, సంపత్, దశరథ్, కటికల భిక్షపతి, వినయ్, రాములు, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీస్ అధికారిని సన్మానించిన కోలా రవీందర్ ముదిరాజ్



**ప్రజాపక్షం/దుండిగల్ :** జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న శివకుమార్ సూరారం చౌరస్తాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ ను కంట్రోల్ చేస్తూ సిగ్నల్స్ ఉన్నా లేకున్నా ఎండలో వానలో తన ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూ ఒక సంవత్సరం కాంట్రాక్టు ఉద్యోగం పూర్తి చేసుకొని వెళ్లిపోతున్న సందర్భంగా డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ వారు ఘనంగా సన్మానం చేశారు. ఇటువంటి ఉద్యోగులను ప్రోత్సహించినట్లయి తే భవిష్యత్తులో పోలీస్ డిపార్ట్మెంట్కు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని పర్యావరణ ప్రేమికుడు, సామాజిక కార్యకర్త శ్రీ కోల రవీందర్ ముదిరాజు అన్నారు.

# బోడుప్పల్ నగర అభివృద్ధికి సహకరించండి

### మేయర్ అజయ్ యాదవ్




**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ నగర పాలక సంస్థ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు అందరు సహకరించాలని మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నాడు బోడుప్పల్ నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలను అజెండగా చేర్చి చర్చించారు. పాలకవర్గం చర్చించిన తరువాత తీసుకున్న నిర్ణయాలు ఇలా ఉన్నాయి. నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజన్ల లో రూ.6 కోట్ల 96 లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టుటకు ఏకగ్రీవంగా తీర్మాణించనైనది. చికెన్, మటన్ వ్యర్థాలను సేకరించి శాస్త్రీయ పద్ధతి లో సేకరించుటకు ఏజెన్సీని నియమించుటకు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. నగర పరిధిలో తై బజార్ రుసుము రద్దు చేస్తూ ఏకగ్రీవంగా పాలక వర్గం ఆమోదం తెలిపారు. నగరం లో నిర్వహించే బోనాల పండుగ సందర్భంగా వివిధ దేవాలయాల వద్ద ఏర్పాటు చేయు ఫ్లక్సీలను నియంత్రించటకు మరియు స్థానిక బంగారు మైసమ్మ దేవాలయమునకు 100 మీటర్ల పరిధిలో ఫ్లక్సీ లు ఏర్పాటు చేయటం నిషేధించుటకు, ఈ విధంగా ఏర్పాటు చేసిన ఫ్లక్సీ లను తొలగించి పెనాల్టీ వేయుటకు గాను పాలక వర్గం ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో కమీషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యుల, వివిధ శాఖల అధికారులు హాజరైనారు.

## సెక్యూరిటీ గార్డులను తొలగిస్తే ఉద్యమమే : ఎఐటియుసి




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఘట్‌కేసర్ సమీపంలోని పోచారంలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో గత 20 ఏళ్ల నుండి పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులను ఏజన్సీ యాజమాన్యం తొలగించే యత్నాలు మానుకోవాలని, లేని పక్షంలో తాము ఆందోళనలు చేపడుతామని ఏఐటియుసి హెచ్చరించింది. ఈ విషయంలో సెక్యూరిటీ గార్డులకు న్యాయం చేకూర్చాలని ఏఐటియుసి మేడ్చల్ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్, రాష్ట్ర నేతలు రవి చంద్రన్, జయచంద్ర, ఘట్‌కేసర్ కార్యదర్శి ఈశ్వర్‌లతో కల్సి శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి టౌన్‌షిప్‌లోని 2080 ప్లాట్లకు సంబంధించి గత 20 ఏళ్లుగా సిబ్బంది సెక్యూరిటీ గార్డులుగా బాధ్యతా యుతంగా రూ. 5 నుండి 9 వేల నెలసరి వేతనంతో పని చేస్తున్నారని, ఈఎస్ఐ, పిఎఫ్‌లు ఇవ్వని యాజమాన్యం వారి స్థానంలో కొత్త వారిని నియమించుకొనేందుకు యత్నిస్తున్నారన్నారు.

## పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

### రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం పని చేసే పోలీసు శాఖ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఉంటుందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. కమిషనరేట్‌లో శుక్రవారం జరిగిన రాచకొండ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ రెండవ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జరిగే సొసైటీ సమావేశంలో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సొసైటీ అధికారులకు, సిబ్బందికి మధ్య వారధి లాగా ఉండి పనిచేయాలని సూచించారు. సొసైటీ సంబంధిత వివరాలను తెలిసేలా వైకె ఇన్ఫోసాఫ్ట్ సంస్థ ద్వారా మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు.

సభ్యుల మరణానంతరం అంత్యక్రియలకు గాను అందించే నగ దు సాయాన్ని రూ.50 నుండి 60 వేలకు పెంచామని, పదవీ విరమణ సమయంలో అందించే సాయాన్ని పది వేలు పెంచామని, సొసైటీ సభ్యుల పిల్లల మెరిట్ స్కాలర్‌షిప్‌లను పెంచుతామన్నారు. అలాగే సొసైటీ రుణాల వడ్డీని తగ్గించామన్నారు. 30 నెలల గడువులో తిరిగి చెల్లించే విధంగా 3 లక్షల రూపాయల రుణాన్ని అందచేస్తున్నామన్నారు. సొసైటీ ఉపాధ్యక్షులు డిసిపి అడ్మిన్ ఇందిర, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి బాలరాజ్, డైరెక్టర్లు జంగయ్య, రవీందర్ రెడ్డి, మహిపాల్, సువర్ణ, లక్ష్మి ప్రసన్న పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు భద్రారెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## చెరువులు, కుంటల్లోకి ఉచితంగా చేప పిల్లలు

### మత్స్యకారుల సొసైటీ సభ్యులకు ఖర్చు లేకుండానే ఆదాయం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మేడ్చల్ జిల్లాలోని గుర్తించిన చెరువులు, కుంటల్లోకి ఉచితంగా చేప పిల్లలను వదిలేందుకు జిల్లా మత్స్య శాఖ సన్నిద్ధమవుతోంది. ఫలితంగా రూపాయి ఖర్చు లేకుండా జిల్లాలో ఉన్న 83 మత్స్యకార సొసైటీలకు చెందిన 3,773 మంది సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా చేప పిల్లలు ఎదిగాకా వాటి అమ్మకం ద్వారా లభించే ఉపాధితో ఆదాయాన్ని పొందగలుగుతారు. చెరువు రకం, విస్తీర్ణం, చెరువుల్లో ఎక్కువ కాలం నిల్వ ఉండే నీళ్ల మేరకు అనుకూలంమైనవిగా గుర్తించి చేప ఏ పరిమాణంలో అనేది నిర్దేశించి మత్స్యశాఖ అధికారులు, సొసైటీ సభ్యుల సమక్షంలో చేప పిల్లలను వదులుతారు.

**ఆగస్టులో ఖరారు కానున్న టెండర్లు**

దీనిలోని భాగంగా ఈ ఏడాది జిల్లాలో చేప పిల్లల పెంపకానికి అనుకూలంగా గుర్తించిన 232 చెరువులు, కుంటల్లోకి 68.05 లక్షల చేప పిల్లలను వదిలేసేందుకు లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని జిల్లా మత్స్య శాఖ అధికారిణి పూర్ణిమ తెలిపారు. వీటిలో 35 నుండి 40 మి.మీ. పరిమాణం కలిగిన రూ. 61,930 విలువైన లక్ష చేప పిల్లలు, 80 నుండి 100 మి.మీ. పరిమాణం కలిగిన రూ. 1,61,640 విలువైన మరో లక్ష చేప పిల్లలు అని చెప్పారు. ఈ చేప పిల్లలను వదిలేందుకు కంట్రాక్టర్ల ఎంపిక కోసం ప్రభుత్వ ఆదేశానుసారం టెండరు ధరఖాస్తులను ఆగస్టు రెండవ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు దాఖలు చేయాల్సి ఉంటుందని, వెంటనే మధ్యాహ్నం 3.30 గంటలకు టెండరు ధరఖాస్తులను తెరచి బిడ్డింగ్ ద్వారా ఎంపిక చేస్తామని చెప్పారు. కంట్రాక్టర్ల ఎంపిక పూర్తయిన అనంతరం రవ్వ, కట్ల, బంగారు తీగ అనే మూడు రకాల చేప పిల్లలను వదులుతారన్నారు. ఇటీవలిగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి నీరు చేరగానే సానుకూలత బట్టి చేప పిల్లలను వదులుతామన్నారు.

## కొడంగల్‌లో 105 మందికి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ మండలంలోని పలు గ్రామాలలో 105 మందికి కళ్యాణ లక్ష్మి , షాదిముభారక్ చెక్కులను పంపిణి చేసినట్లు తహశీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని అంగడిరాయిచూర్,అన్నారం,అప్పాయిపల్లి,చిన్ననందిగామ, చిట్లపల్లి, కస్తూర్‌పల్లి, కొడంగల్, నాగారం, పర్సాపూర్,పెద్దనందిగామ, ఫ్యాలమద్ది,రావులపల్లి, రుద్రారం, ఉద్రారం, ఊడిమేశ్వరం తదితర గ్రామాలలో కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి , షాదిముభారక్ కింద దాదాపు 105 మందికి గాను 1,01,88,064 రూపాయల చెక్కులను అందించారు. అదేవిధంగా సిఎం రిలిఫ్‌ఫండ్ చెక్కులను కూడా పలు గ్రామాలలో ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కడ అధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతు తెలంగాణ ప్రభుత్వం అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తుందని తెలిపారు. మహిళలందరికి ఉచిత ఆర్‌టీసీ బస్సు, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందించడం జరుగుతుందన్నారు. రాబోయో రోజులలో కొడంగల్ మరింత అభివృద్ధి చెందుతు ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. అనంతరం గ్రామాలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాగారం గ్రామంలో గ్రామస్థుల సహాకారంతో శివాజీ విగ్రహానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రెడ్డి, గోడల రాంరెడ్డి,ముస్తాఖ్,నాగప్ప, చుక్కయ్య, రుద్రారం వెంకటయ్యగౌడ్, సాయిలు,బాబయ్యగౌడ్, పాటుమీదిపల్లి సంతోష్, నాగారం బస్వంత్‌రెడ్డి గ్రామస్థులు తదితరులున్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

### తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్

**ప్రజాపక్షం/తాండూరు:** ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ అన్నారు. తాండూరు పురపాలక శాఖ ఆద్వార్యన శుక్రవారం పట్టణంలోని వాల్మీనగర్, గొల్లచెరువు, దర్గా ప్రాంతాలలో అంటు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల వల్ల అంటు వ్యాధులు ప్రభలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని, ప్రతి నీటి నిలువలపై కప్పి పెట్టుకోవాలని సూచించారు. పరిసర పరిశుభ్రతతోనే వ్యాధులను అరికట్టవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ విక్రమసింహారెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసిఐఎల్‌లో మేడ్చల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభం

### మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రిలో 220 పడకలకు పెంపు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** గత ప్రభుత్వ హయాంలో మేడ్చల్ జిల్లాకు గాను అనుమతించిన ప్రభుత్వ మెడికల్ కాలేజి తాత్కాలిక ప్రాతిపదికన ఈసిఐఎల్‌లోని ఓ ప్రయివేట్ భవనంలో 202425 విద్యా సంవత్సరానికి గాను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మెడికల్ కాలేజి ఏర్పాటుకు అనుమతి లభించిన కుత్బుల్లాపూర్ ప్రాంతంలో ప్రభుత్వం మంజూరు చేసిన 20 ఎకరాల స్థలంలో భవన నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాక పోవటం, ఈ విద్యా సంవత్సరంలో మెడికల్ కాలేజి తరగతులు ప్రారంభించని పక్షంలో అనుమతులు రద్దవుతాయన్న కారణంగా ఎలాగైనా ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభించాలన్న తప్పని పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈసిఐఎల్‌లో తాత్కాలిక భవనాన్ని అధికారులు నిర్ణయించారు. దీనికి జాతీయ మెడికల్ కౌన్సిల్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజికి అవసరమైన అన్ని వైద్య విభాగాలు, ల్యాబ్‌లు, తరగతి గదులు, మౌళిక సదుపాయాలు పూర్తి కావించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి ఇటీవల జరిగిన ప్రభుత్వ మెడికల్ కాలేజిల్లో చేసిన బదిలీల్లో భాగంగా ఈసిఐఎల్‌లో తాత్కాలికంగా ప్రారంభమయ్యే మేడ్చల్ జిలాల ప్రభుత్వ మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మురళీకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోసారి జాతీయ మెడికల్ కౌన్సిల్ ఈ భవనంలో పూర్తయిన భవనంలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం 2024–25 విద్యా సంవత్సరానికి గాను త్వరలో జరిగే కౌన్సిలింగ్ ద్వారామొదటి సంవత్సరం ఎంబిబిఎస్‌కు గాను 50 సీట్లు కేటాయించనున్నారు. అదే విధంగా ఈ కాలేజికి గాను అనుబంధంగా 50 పడకల మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రిని 220 పడకలకు అప్‌గ్రేడ్ చేయనున్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలకు కావాల్సిన మౌళిక వసతులు కల్పిస్తున్నామని సిఎస్‌ఆర్ ఆర్మ్ ఆఫ్ బయోలాజికల్ లిమిటెడ్ సిఈవో లక్ష్మీ నారాయణ అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామంలోని పల్లె దవఖాన( ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లో కావాల్సిన వీల్‌చైర్, టెబుల్స్, వాటర్ డిస్పెన్సరి, మెడికల్ స్టోర్ ర్యాక్స్, ఫర్నిచర్, సోలార్ ఇతర వస్తువులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కావాల్సిన వస్తువులను సమకూర్చుతామని చెప్పారు. సుమారు రూ. 7 లక్షలతో పల్లె దవకాణాలో ప్రజలకు ఉపయోగపడే వస్తువులను అంజేశామని చెప్పారు. ప్రజలకందరికి అందుబాటులో వైద్యం అందించే ప్రభుత్వ వైద్య శాలలకు కావాల్సిన వస్తు సామాగ్రిని అందజేశామని పేర్కొన్నారు. మా కంపెని తరపున సమాజ సేవ చేయాలనే ఆలోచనతో సోషల్ రెస్పాన్సబిలిటిలో బాగంగా ఈ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. మాద్వార అందించిన వస్తువులను జాగ్రత్తగా వినియోగించుకోవడానికి ఒక కమిటి ఏర్పాటు చేసుకుని ఈ సామాగ్రిని వాడుకునే విదంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పల్లె దవఖానా పరిసరాల్లో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ గుర్క కుమార్, రైతు బంధు సమితి అద్యక్షుడు కమతం కృష్ణారెడ్డి, కంపెని ప్రతినిధులు రుద్రరాజు ప్రభాకర్, కృష్ణ చైతన్య, శామీర్‌పేట పిహెచ్‌సి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రవీందర్, డాక్టర్ సంగీత, ఎఎన్ఎం పారిజాత, ఆశాలు లలిత, సరిత, మాధవి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.



# అతి వేగం.. రెండు ప్రాణాలు బలి



* స్కూటీ, బస్సును ఢీకొట్టిన ఇన్నోవా కారు
* ఒకరి పరిస్థితి విషమం.. తొమ్మిది మందికి స్వల్పగాయాలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అతి వేగం రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది.. స్కూటీ, ఓ ఫార్మా కంపెని బస్సును ఇన్నోవ కారు ఢీకొట్టడంతో ఒకరి పరిస్థితి విషమంగా మారి తొమ్మిది మందికి స్వల్ప గాయాలైన సంఘటన తుర్కపల్లి జినోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8.15 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. తుర్కపల్లి జినోమ్‌వ్యాలీ ఇన్స్‌పెక్టర్ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హాకింపేట(సింగాయిపల్లి)కి చెందిన మోహన్(25), మౌలాలికి చెందిన దీపిక(23) వీరిద్దరు స్నేహితులు నగరంలోని మైండ్‌స్పేస్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనిలో పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో (ఏపి02క్యూ 2268) ఇన్నోవ కారులో కరీంనగర్ హైద్రాబాద్ రాజీవ్ రహాదారి గుండా సిద్దిపేటకు లాంగ్‌టూర్‌కు బయల్దేరారు. తిరుగు ప్రయాణంలో లాల్‌గడిమలక్‌పేట రెవెన్యూ పరిధిలోని విమలాఫీడ్‌కు సమీపంలో కారును అతి వేగంగా నిర్లక్ష్యంగా నడపడంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలి వైపుకి గాల్లో ఎగిరి ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టింది. అదే రూట్‌లో వస్తున్న బీఈ ఫార్మా కంపెని బస్సును కూడ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు రెండు, మూడు పల్టీలు కొడుతూ ఫర్లాంగు దూరం వరకు దూసుకపోయి కారు నుజ్జునుజ్జయింది. మోహన్, దీపికలు రోడ్డుపైకి ఎగిరిపడటంతో తలకు ఇతర




శరీర బాగాలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే దుర్మరణం చెందారు. స్కూటీపై ప్రయాణిస్తున్న శశిధర్, సుబుదాస్‌కు తీవ్ర గాయాలు కాగా సుబుదాస్ పరిస్థితి విషమించింది. కంపెని బస్సు డ్రైవర్ అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కకు ఉన్న చెట్ల పొదల్లోకి తీసుకెళ్లాడు. బస్సులో సుమారు 40 మంది ఉద్యోగస్తులు ఉండగా డ్రైవర్‌తో పాటు తొమ్మిది మందికి స్వల్పగాయాలయ్యాయి. స్కూటీపై ఉన్న ఇద్దరితో పాటు కంపెని బస్సులో ఉన్న తొమ్మిది మంది క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరిని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించామని, బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్‌పెక్టర్ యాదయ్య తెలిపారు.

**సంఘటన స్థలాన్ని సందర్శించిన డిసిపి కోటిరెడ్డి**

ప్రమాద సంఘటన స్థలాన్ని మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వివరాలను ఇన్స్‌పెక్టర్ యాదయ్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే ట్రాఫిక్ ఏసిపి వెంకట్‌రెడ్డి, పేట్‌బషీరాబాద్ ఏసిపి రాములు, ట్రాఫిక్ మేడ్చల్ సిఐ హనుమాన్‌గౌడ్‌లు ప్రమాదంపై పూర్తి స్థాయిలో విచారించారు. రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం జరుగడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఇన్నోవ కారు నుజ్జునుజ్జు కావడంతో కారు విడి బాగాలు రోడ్డుపైకి ఎగిరిపడ్డాయి. కంపెని బస్సు చెట్ల పొదల్లోకి దూసుకెళ్లడంతో రెండు, మూడు చెట్లు విరిగిపోయాయి. ట్రాఫిక్‌జామ్ కావడంతో పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమై ట్రాఫిక్‌ను నియంత్రించారు. ప్రమాదాన్ని చూడటానికి ప్రజలు, వాహనాదారులు పెద్ద ఎత్తున గుమిగూడారు.

# క్రీడ

## వెదురు కర్రలతో ప్రాక్టీస్ నుంచి పారిస్ వరకు




పారిస్ ఒలింపిక్స్‌లో ఉమెన్స్ జావెలిన్ త్రోలో భారత్ పతకం గెలుస్తుందని ఆశిస్తున్నారు. గతేడాది ఆసియా క్రీడల్లో బంగారు పతకం సాధించిన అన్నూ రాణి, ఇప్పుడు ఒలింపిక్స్ బరిలో నిలిచింది. ఆసియా క్రీడల తర్వాత అన్నూ రాణి స్టార్‌గా మారింది. ఈ స్థాయికి రావడానికి ఆమె చాలా కష్టపడింది. ఆమె ఒకప్పుడు జావెలిన్ కూడా కొనుగోలు చేయలేక వెదుదు కర్రలు, చెరకు గడలతో ప్రాక్టీస్ చేసింది. ఇంకా చెప్పాలంటే అన్నూ రాణి పల్లె నుంచి పారిస్ వరకు ఎదిగిన తీరు నిజంగా స్ఫూర్తిదాయకం. అయితే తాజాగా అన్నూ రాణి కుటుంబ సభ్యులను ఈటీవీ భారత్ పలకరించింది. వారు ఆమె ఎదుర్కొన్న కష్టాలు, పట్టుదలను వివరించారు. పారిస్‌లో అన్నూ బంగారు పతకం గెలుస్తుందని నమ్మకంగా ఉన్నారు.

**ప్రారంభ జీవితం... పోరాటాలు**

అన్నూ రాణి ఉత్తరప్రదేశ్‌లోని బహదూర్‌పూర్‌లో జన్మించింది. అమర్‌పాల్ సింగ్, మున్నీ దేవి తల్లిదండ్రులు. వారిది వ్యవసాయ కుటుంబం. పెద్దయ్యాక అన్నూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. కొత్త జావెలిన్ కొనడానికి డబ్బు లేక, వెదురు కర్రలతో లేదా చెరకు గడలతో త్రో ప్రాక్టీస్ చేసేదని ఆమె తల్లి మున్నీ దేవి చెప్పారు. మొదట్లో, అన్నూ క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడాన్ని తండ్రి అమర్‌పాల్ వ్యతిరేకించారు. అయితే ఆమె ప్యాషన్, సంకల్పం అర్థం చేసుకున్న తర్వాత, ఆమెకు పూర్తిగా మద్దతుగా నిలిచారు. ఇప్పుడు తన కూతురి వల్లే ప్రజలు తనను గుర్తిస్తున్నారని సగర్వంగా చెప్పారు.

**జావెలిన్ వైపు ఎలా వచ్చింది?**

అన్నూకి ముందు షాట్‌పుట్ లేదా డిస్కస్ త్రోపై ఆసక్తి ఉండేదని ఆమె సోదరుడు ఉపేంద్ర తెలిపారు. వాటిపై ఆసక్తితోనే క్రీడల్లోకి అడుగుపెట్టింది. అయితే ఆమె కోచ్ జావెలిన్ త్రోలో ఆమె సామర్థ్యాన్ని చూసి, దానిపై దృష్టి పెట్టమని సలహా ఇచ్చారు. అలా అతని సలహాతో, జావెలిన్ త్రోలో పట్టు సాధించేందుకు ప్రయత్నించింది అన్నూ. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించి త్వరగానే పేరు తెచ్చుకుంది. గతంలో ఉత్తరప్రదేశ్, హరియాణాలోని పశ్చిమ ప్రాంతాలకు చెందిన బాలికలు ఇళ్లకే పరిమితమయ్యేవారు. కానీ ఇప్పుడు ఆ రాష్ట్రాలకు చెందిన అథ్లెట్లు వివిధ క్రీడల్లో రాణిస్తున్నారు. ఒకప్పుడు అన్నూ తెల్లవారుఝామున 4 గంటలకు రన్నింగ్ వెళ్లి, సూర్యుడు వచ్చేలోపు ఇంటికి తిరిగి వచ్చేసేది. ఎందుకంటే గ్రామంలోని అమ్మాయిలు ఎవ్వరూ లో స్కర్టులు ధరించరు. ఆడ పిల్లలు ఎవ్వరూ క్రీడలు ఆడరు. అయితే ఇప్పుడు తన విజయాలతో ఇప్పుడు అన్నూ రాణి ఎందరో వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా మారింది.

## టీమ్‌ఇండియాది అదే జోరు..

ఆసియాకప్‌లో బంగ్లాను చిత్తు చేసి ఫైనల్‌కు



వరుస విజయాలతో ఆసియా కప్ సెమీస్‌కు దూసుకొచ్చిన భారత మహిళల జట్టు అదే జోరును కొనసాగిస్తోంది. తొలి సెమీస్‌లో బంగ్లాను 10 వికెట్ల తేడాతో చిత్తు చేసి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. మొదట భారత్ బౌలర్లు బంగ్లా బ్యాటర్ల పని పట్టగా.. ఆ తర్వాత ప్రత్యర్థి నిర్దేశించిన 81 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని హర్మన్‌ప్రీత్ సేన ఉఫ్ అని ఊదేసింది. వికెట్ కోల్పోకుండా షఫాలి వర్మ(26), స్మృతి మంధాన(55) జంట సునాయాసంగా ఛేదించింది. 11 ఓవర్లలోనే వీరు జట్టును విజయతీరాలకు చేర్చారు. అంతకుముందు టాస్ గెలిచిన బంగ్లా జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. భారత బౌలర్లు కట్టడి చేయడంతో ప్రత్యర్థి జట్టు 8 వికెట్ల నష్టానికి 80 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ జట్టు సారథి నిగర్ సుల్తానా ఒక్కరే కాస్త పోరాడి 32 పరుగులు చేయగా.. ఆఖర్లో వచ్చిన షోర్నా 19 పరుగులతో రాణించింది. మిగతా బ్యాటర్లు ఎవ్వరూ సింగిల్ డిజిట్ దాటలేకపోయారు. భారత బౌలర్లలో రేణుకా, రాధా యాదవ్ మూడేసి వికెట్లతో ఆకట్టుకోగా.. పూజా వస్త్రాకర్, దీప్తిశర్మ తలో వికెట్ తీశారు. రెండో సెమీస్(శ్రీలంక vs పాకిస్థాన్) విజేతతో ఈనెల 28న భారత్ ఫైనల్ ఆడనుంది. ఒకవేళ పాకిస్థాన్ మహిళల జట్టు ఫైనల్ చేరుకుంటే పోరు రసవత్తరంగా ఉండనుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే పాకిస్థాన్‌ను లీగ్ దశలో టీమ్‌ఇండియా 7 వికెట్ల తేడాతో చిత్తు చేసిన విషయం తెలిసిందే.

## ఆటపట్టు అదరహో

ఫైనల్‌కు శ్రీలంక- సెమీస్‌లో పాక్ ఓటమి



మహిళల ఆసియా కప్‌లో శ్రీలంక ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠ భరితంగా సాగిన సెమీఫైనల్ 2 మ్యాచ్‌లో శ్రీలంక 3 వికెట్ల తేడాతో నెగ్గింది. పాకిస్థాన్ నిర్దేశించిన 141 పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక 19.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. లంక విజయంలో కెప్టెన్ చమరీ అటపట్టు (63 పరుగులు) హాఫ్ సెంచరీతో కీలకంగా వ్యవహరించింది. కాగా, ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫిరోజా (25), మునీనా (37) రాణించారు. ఇక తాజా ఓటమితో పాకిస్థాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

**భారత్ x శ్రీలంక:** తాజా విజయంతో ఫైనల్‌కు అర్హత సాధించిన శ్రీలంక తుదిపోరులో భారత్‌తో పోటీపడనుంది. ఆదివారం (జులై 28) ఇరుజట్ల మధ్య టైటిల్ పోరు జరగనుంది.




## 'జోవియల్ స్టార్' ట్యాగ్‌తో వచ్చిన రాజ్ తరుణ్

యంగ్ హీరో రాజ్ తరుణ్‌కు యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. అతడు ఎంచుకునే కథలు చాలా నేటివ్‌గా ఉండటంతో యూత్ వాటికి బాగా కనెక్ట్ అవుతుంటారు. అయితే, ఇటీవల కాలంలో సరైన సక్సెస్ లేని రాజ్ తరుణ్ ప్రస్తుతం ఓ మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలో అతడు నటించిన 'పురుషోత్తముడు' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక ఈ సినిమా టైటిల్ కార్డ్స్‌లో రాజ్ తరుణ్‌కు ఓ కొత్త ట్యాగ్ వేశారు. 'జోవియల్ స్టార్' రాజ్ తరుణ్ అని టైటిల్ కార్డ్స్ లో చూసి ప్రేక్షకులు ఒకింత స్టన్ అయ్యారు. పక్కింటి కుర్రాడి తరహా పాత్రలతో మెప్పించే రాజ్ తరుణ్‌కి ఇది పర్ఫెక్ట్‌గా సెట్ అవుతుందని అతడి అభిమానులు అంటున్నారు. మంచి ట్యాలెంట్ ఉన్నప్పటికీ సరైన హిట్స్ లేని కారణంగా వెనకబడ్డ రాజ్ తరుణ్ 'పురుషోత్తముడు' సినిమాతో తిరిగి సక్సెస్ ట్రాక్ ఎక్కాలని చూస్తున్నాడు. మరి ఈ సినిమా అతడికి ఎలాంటి హిట్ అందిస్తుందో చూడాలి.

# రీల్


## 'డియర్ కామ్రేడ్' స్పెషల్ అంటోన్న రష్మిక



నేషనల్ క్రష్ రష్మిక మందన్న సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉంటుందో అందరికీ తెలిసిందే. తన సినిమాల గురించి, తన పర్సనల్ లైఫ్ గురించి ఎప్పటికప్పుడు అభిమానులతో పలు విషయాలను షేర్ చేసుకుంటుంది. ఆమె సోషల్ మీడియాలో ఏది పోస్ట్ చేసినా అభిమానులు ఫాలో అవుతుంటారు. అయితే, ఆమె తాజాగా డియర్ కామ్రేడ్ సినిమా గురించి ఓ పోస్ట్ చేసింది. విజయ్ దేవరకొండ, రష్మిక కాంబినేషన్‌లో వచ్చిన ఈ సినిమా 2019లో రిలీజ్ అయ్యింది. నేటికి ఈ సినిమా వచ్చి 5 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా తన అనుభవాలను పంచుకుంది. 'డియర్ కామ్రేడ్' కథను విన్న దగ్గర్నుంచి ఆ సినిమాకోసం క్రికెట్ ఆటను నేర్చుకోవడం, షూటింగ్ లో పాల్గొనడం వరకు చాలా కష్టపడ్డామని.. సినిమా ముగియడంతో ఏదో తెలియని బాధ.. రిలీజ్ సందర్భంగా అభిమానులతో కలిసి ఆడిపాడటం.. రిజల్ట్ ఏదైనా 5 సంవత్సరాలుగా తనపై ప్రేమను కురిపిస్తున్న అభిమానులకు రుణపడి ఉంటానని రష్మిక పేర్కొంది. ఇక ఈ సినిమాలోని తన పాత్ర 'లిల్లీ'గానే చాలా మంది తనను ఇంకా పిలుస్తుండటం తనకు ఎంతో స్పెషల్ అని ఆమె చెప్పుకొచ్చింది.


తన యుగానికి ఒక్కడు హీరో

## 'రాయన్'పై దర్శకుడు రివ్యూ..




కోలీవుడ్ టాలెంటెడ్ నటుడు అలాగే దర్శకుడు అయినటువంటి ధనుష్ హీరోగా తన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన లేటెస్ట్ అవైటెడ్ చిత్రమే రాయన్. మరి ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కించిన ఈ చిత్రంలో సందీప్ కిషన్, ప్రముఖ దర్శకుడు సెల్వ రాఘవన్ తదితరులు కూడా నటించారు. అయితే ఈ సినిమా నేడు తెలుగు సహా తమిళ్ లో రిలీజ్ కి వస్తుండగా థియేటర్స్ లోకి వచ్చే ముందే ఈ సినిమా నటుడు అలాగే ప్రముఖ దర్శకుడు సెల్వ రాఘవన్ తన ఫస్ట్ రివ్యూ ఇచ్చేసారు. రాయన్ చూసాను, మాటల్లేవు, మైండ్ బ్లోయింగ్ గా ఉంది. ధనుష్ నటుడుగాను దర్శకుడుగా కూడా షైన్ అయ్యారు. నిన్ను చూసి చాలా గర్వంగా ఉంది బ్రదర్, అందరి నటీనటుల పెర్ఫామెన్స్‌లు చాలా బాగున్నాయి. ఏ ఆర్ రెహమాన్ తన సంగీతంతో మరో ప్రపంచంలోకి తీసుకెళ్లిపోయారు. టీం అం దరి విషయంలో ఎంతో ఆనందంగా ఉంది అని తన యుగానికి ఒక్కడు 2 హీరో ధనుష్ సినిమాపై ప్రశంసలు కురిపించారు.

## 'లక్కీ భాస్కర్' టైటిల్ ట్రాక్‌కి డేట్ ఫిక్స్



మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం లక్కీ భాస్కర్. దుల్కర్ సల్మాన్ నటించిన సీతారామం చిత్రంతో తెలుగు ఆడియెన్స్ లో విపరీతమైన క్రేజ్ ను సొంతం చేసుకున్నారు. ఇటీవల కల్కి2898ఎడి చిత్రంలో కూడా కీలక పాత్రలో కనిపించారు. ఇప్పుడు ఈ లక్కీ భాస్కర్ పై ప్రేక్షకుల్లో ఎంతో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో గుంటూరు కారం ఫేమ్ మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తుంది. ఈ చిత్రంలో మరొక బ్యూటీ అయేషా ఖాన్ కూడా కనిపించనుంది. ఇప్పటికే మ్యూజికల్ ప్రమోషన్స్ ను మేకర్స్ స్టార్ట్ చేయడం జరిగింది. ఫస్ట్ సింగిల్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. టైటిల్ ట్రాక్ ను జూలై 28 వ తేదీన రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ సరికొత్త పోస్టర్ ద్వారా వెల్లడించారు. తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రంను సితార ఎంటర్టైన్మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్ లపై నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

## కొత్తింటికి రాహుల్ గాంధీ..

ఆఫర్ చేసిన హౌస్ కమిటీ!



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కేంద్ర ప్రభుత్వం కొత్త నివాసాన్ని కేటాయించనుంది. సునేహ్రి బాగ్ రోడ్డులోని బంగ్లా నెంబర్ 5ను హౌస్‌కమిటీ ఆయనకు ఆఫర్ చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన సోదరి ప్రియాంకాగాంధీ ఈ బంగ్లాను చూసేందుకు రావడంతో దీనిపై వార్తలు మొదలయ్యాయి. ఆ ఇంటి విషయంలో రాహుల్ రిప్లై ఇవ్వడమే ఇంకా మిగిలి ఉన్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ ఎంపిగా విజయం సాధించారు. ఈసారి ఆయన లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్నారు. అది క్యాబినెట్ ర్యాంకు హోదా కావడంతో టైప్ 8 బంగ్లాను పొందేందుకు ఆయన అర్హులు. టైప్ 8 బంగ్లాను క్యాబినెట్ మంత్రులు, సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు, సహాయ మంత్రులు, కేంద్ర ప్రభుత్వంలోని కీలక కార్యదర్శులకు కేటాయిస్తారు. గతేడాది పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడి లోక్‌సభలో అనర్హత వేటు పడటంతో రాహుల్ అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. తర్వాత సుప్రీం కోర్టు ఆయనకు అనర్హతపై స్టే విధించింది. ఇక అప్పటి నుంచి 10 జనపథ్‌లోని తన తల్లి సోనియా గాంధీ నివాసంలోనే రాహుల్ ఉంటున్న విషయం తెలిసిందే.

## పేర్లు ప్రదర్శించమని బలవంతం చేయలేం: సుప్రీం

**న్యూఢిల్లీ :** కావడి యాత్ర మార్గంలో తినుబండారాలు విక్రయించేవారు దుకాణాలపై యజమానులు, సిబ్బంది పేర్లు ప్రదర్శించాలని ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌లు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలవగా జులై 22న సుప్రీం విచారించి మధ్యంతర స్టే విధించింది. తాజాగా జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్‌ల ధర్మాసనం మధ్యంతర స్టేను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లుగానే పేర్లను బహిర్గతం చేయమని ఎవరినీ బలవంతం చేయలేమని ధర్మాసనం పేర్కొంది. ఎవరైనా యజమానులు స్వచ్ఛందంగా పేర్లను ప్రదర్శించాలనుకుంటే వారిని ఆపేందుకు ఎవరూ బలవంతం చేయకూడదనే ఉద్దేశంతోనే స్టేను విధించామని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తమ స్పందనలు దాఖలు చేయాలని ప్రభుత్వాలను కోరింది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేసే ప్రత్యుత్తరాలపై తమ స్పందనలు నివేదించేందుకు పిటిషనర్లకు అనుమతిస్తూ తదుపరి విచారణ ఆగస్టు 5కి వాయిదా వేసింది. కావడి యాత్రలో దుకాణాలపై పేర్లు ప్రదర్శించాలనే ఆదేశాలను వ్యతిరేకిస్తూ తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా, ప్రొఫెసర్ అపూర్వానంద్, కాలమిస్ట్ ఆకర్ పటేల్ తదితరులు సుప్రీంలో పిటిషన్లు దాఖలు చేశారు. ఇక, కావడి యాత్ర శాంతియుతంగా సాగేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తాజాగా ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సమర్థించుకుంటూ సుప్రీంకోర్టులో వివరించింది.

## పార్లమెంట్‌లో కుదుపు

పలు అంశాలపై ఉభయసభల్లో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో పశ్చిమ బెంగాల్ విభజన, కర్నాటకలో ఓ మంత్రికి కుంభకోణంలో భాగస్వామ్యం ఉన్నట్లు వచ్చిన ఆరోపణలపై, అటు రాజ్యసభలో రిజర్వేషన్ల అంశంపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. ఫలితంగా సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి. కేంద్ర మంత్రి సుకనతా మజుందార్, బిజెపి నాయకుడు నిషికాంత్ దూబే ప్రస్తావించిన పశ్చిమబెంగాల్ విభజన అంశాన్ని లేవనెత్తడానికి తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ లోక్‌సభలో ప్రయత్నించారు. అయితే స్పీకర్ ఓమ్ బిర్లా ఈ అంశాన్ని లేవనెత్తేందుకు అనుమతించలేదు. మజుందార్ సభలో బెంగాల్ విభజనకు సంబంధించిన వ్యాఖ్యలు చేయలేదని, అదే విధంగా దూబే వ్యాఖ్యలు జీరో అవర్ ప్రస్తావనలో భాగమని స్పీకర్ వాదించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వంలో మంత్రి ప్రమేయం ఉందని వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణాన్ని లేవనెత్తడానికి బిజెపి నాయకుడు పిసి మోహన్ ప్రయత్నించారు. ఈ అంశాన్ని కూడా లేవనెత్తడానికి స్పీకర్ అనుమతించలేదు. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌ను విభజించే ఎలాంటి కుట్రను విజయవంతం చేయనివ్వబోమని నినాదాలు చేస్తూ టిఎంసి సభ్యులు సభా వెల్‌లోకి దూసుకెళ్లారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బిజెపి సీనియర్ నేత అనురాగ్ ఠాకూర్ కూడా వారి స్థానాల్లో నిలబడి కర్ణాటక ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తీవ్ర గందరగోళం కొనసాగడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12:30కి వాయిదా వేశారు. ఇదిలా ఉండగా రిజర్వేషన్ అంశం రాజ్యసభను కుదిపివేసింది. 1993లో అప్పటి ప్రధాని పివి నరసింహారావు హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆఫీస్ మెమోరాండం ద్వారా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి 27 శాతం రిజర్వేషన్లు కల్పించిందని కాంగ్రెస్ ఎంపి నీరజ్ డాంగి చెప్పడంతో వాగ్వాదం మొదలైంది. గందరగోళం మధ్య, కుల ఆధారిత జనాభా గణనను డిమాండ్ చేస్తూ 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించాలని డాంగి తన ప్రసంగాన్ని కొనసాగించారు. అధికార పార్టీ సభ్యులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించడంతో, స్పీకర్ స్థానంలో ఉన్న ఎస్ ఫాంగ్నాన్ కొన్యాక్ సభను మధ్యాహ్నం 3 గంటలకు గంటపాటు వాయిదా వేశారు.

## మనీష్‌తోపాటు కవిత జ్యుడిషియల్ కస్టడీ మళ్లీ పొడిగింపు



**న్యూఢిల్లీ :** మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఆప్ నేత, ఢిల్లీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా, బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కె. కవితల జ్యుడిషియల్ కస్టడీ జులై 31 వరకు ఢిల్లీ కోర్టు పొడిగించింది. తీహార్ జైల్లోనున్న వీరిని శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ కోర్టు ఎదుట పోలీసులు హాజరు పరిచారు. ఢిల్లీ మద్యం కేసులో అవినీతి ఆరోపణల నేపథ్యంలో వీరిని సిబిఐ అరెస్ట్ చేసింది. ఇటీవల కవితకు వ్యతిరేకంగా కోర్టులో సప్లిమెంటరీ చార్జ్‌షీట్‌ను సిబిఐ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ వ్యవహారంలో బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కె. చంద్రశేఖర్ రావు కుమార్తె, ఎమ్మెల్సీ కె. కవితపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 15వ తేదీన కవితను ఇడి అరెస్ట్ చేసింది. అనంతరం ఢిల్లీలోని తీహార్ జైలుకు తరలించింది. అయితే ఇదే కేసులో ఏప్రిల్ 11వ తేదీన ఆమెను సిబిఐ అరెస్ట్ చేసింది. నాటి నుంచి ఆమె తీహార్ జైలులోనే ఉన్నారు. ఇక ఇదే కేసులో 2023, ఫిబ్రవరి 26వ తేదీన ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియాను సిబిఐ అరెస్ట్ చేసింది. అనంతరం ఈ కేసులోనే మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో ఈ ఏడాది మార్చి 9న మనీష్ సిసోడియాను ఇడి అరెస్ట్ చేసింది. ఆయనకు సైతం నాటి నుంచి బెయిల్ లభించకపోవడం గమనార్హం.

## నేడు నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్

విపక్ష పాలిత రాష్ట్రాలు బహిష్కరణ




**న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన 'నీతి ఆయోగ్' 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం శనివారంనాడు జరుగనుంది. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ఈ సమావేశం జరుగుతుందని శుక్రవారం నాడు ఒక అధికార ప్రకటన వెలువడింది. 'వికసిత్ భారత్@2047' అనే థీమ్‌తో, అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను రూపొందించడంపై ఈ సమావేశం దృష్టి సారించనుంది. వికసిత్ భారత్ @2047 విజన్ డాక్యుమెంట్ కోసం అప్రోచ్ పేపర్‌పై సమావేశం చర్చిస్తుందని ఆ ప్రకటన తెలిపింది. కేంద్ర, రాష్ట్రాల మధ్య పరస్పర సహకారాన్ని వేగవంతం చేయడం, గ్రామీణపట్టణ జనాభా జీవన ప్రమాణాలను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నీతి ఆయోగ్ సమావేశంలో చర్చించనున్నారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ జిడిపితో భారతదేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవాలనే లక్ష్యాన్ని భారతదేశం నిర్దేశించుకుంది. 2047 నాటికి ఈ లక్ష్యం సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కొలాబొరేటివ్ అప్రోచ్ ఉండేలా నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం చర్చించి, ఈ విజన్ సాకారానికి రోడ్ మ్యాప్‌ను రూపొందించనుంది. 2023 డిసెంబర్ 27–29 మధ్య జరిగిన 3వ చీఫ్ సెక్రటరీల జాతీయ సదస్సులో చేసిన సిఫారసులపై కూడా నీతి ఆయోగ్ సమావేశంలో చర్చించనున్నారు. నాటి సదస్సులో చర్చకు వచ్చిన సైబర్ సెక్యూరిటీ, ఆస్పిరేషనల్ డిస్ట్రిక్స్ అండ్ బ్లాంక్స్ ప్రోగ్రామ్, రోల్ ఆఫ్ స్టేట్, ఎఐ ఇన్ గవర్నెన్స్ అంశాలపై కూడా స్పెషల్ సెషన్స్ నిర్వహించనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత వహించే నీతి ఆయోగ్ సమావేశంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, ఎక్స్ అఫీసియో మెంబర్లు, ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్ర మంత్రులు, వైస్ చైర్మన్, నీతి ఆయోగ్ సభ్యులు పాల్గొనున్నారు.

**విపక్ష పాలిత రాష్ట్రాల బహిష్కరణ**

ఇదిలా ఉండగా, 'నీతి ఆయోగ్' 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని విపక్ష పాలిత రాష్ట్రాలు బహిష్కరించాయి. మూడు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, హిమాచల్, కర్నాటక ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సుఖ్విందర్ సింగ్ సుఖు, సిద్దరామయ్యలు సమావేశానికి తాము హాజరు కాబోమని ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లోతమ రాష్ట్రాలకు తీవ్ర అన్యాం చేశారని, అందువల్ల తాము బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా తమిళనాడు సిఎం, డిఎంకె నేత ఎంకె స్టాలిన్, కేరళ సిఎం, సిపిఐ(ఎం) నేత పినరయ్ విజయన్‌తో పాటు ఆప్ నేతృత్వంలోని పంజాబ్, ఢిల్లీ ప్రభుత్వాలు కూడా సమావేశాన్ని బహిష్కరించాయి. అయితే జెఎంఎం ఎంపి మహువా మజి మాత్రం జార్ఖండ్ రాష్ట్ర ప్రయోజనాల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

**రాజకీయ వివక్షపై నిరసన తెలుపుతా : మమతా బెనర్జీ**

పశ్చిమబెంగాల్ పట్ల చూపుతున్న రాజకీయ వివక్షపై నిరసన తెలపనున్నట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ చెప్పారు. ఢిల్లీకి శుక్రవారం బయలుదేరే ముందు మీడియాతో ఆమె మాట్లాడారు. 'బెంగాల్ పట్ల చూపిస్తున్న రాజకీయ వివక్షపై నీతి ఆయోగ్‌లో నిరసన తెలియజేస్తాను. కేంద్ర బడ్జెట్‌లో బెంగాల్, ఇతర విపక్ష రాష్ట్రాల పట్ల వివక్ష చూపారు. దీనిని మేము అంగీకరించం' అని మమత తెలిపారు. ఆర్థిక, భౌగోళిక అవరోధాలు సృష్టించడం ద్వారా బెంగాల్‌ను విడగొట్టాలన్నదే బిజెపి మంత్రులు, నేతల ఆలోచన అని ఆమె ఆరోపించారు. ఒకవైపు పార్లమెంటు జరుగుతుండగా జార్ఖండ్, బీహార్, అసోం, బెంగాల్‌ను విడగొడతామంటూ భిన్న నాయకులు భిన్న ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి ధోరణులను తాము గట్టిగా ఖండిస్తామని చెప్పారు. పశ్చిమబెంగాల్‌ను విభజించడమంటే దేశాన్ని విడదీయడమేనని, నీతి ఆయోగ్ సమావేశంలో తన వాణిని బలంగా వినిపిస్తానని, అందుకు అనుమతించకుంటే తాను నిరసన తెలిపి సమావేశం నుంచి బయటకు వచ్చేస్తానని చెప్పారు.

## కేరళ, బెంగాల్ గవర్నర్ కార్యాలయాలకు సుప్రీం నోటీసులు



**న్యూఢిల్లీ :** కేరళ, పశ్చిమ బెంగాల్ గవర్నర్ కార్యాలయాలకు సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. గవర్నర్ల వద్ద పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. పిటిషన్‌పై విచారణ జరిపిన సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెపి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కేంద్ర హోంశాఖకు, గవర్నర్ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రపతికి పంపించాల్సిన బిల్లులపై ఆమోదం తెలపకుండా ఆలస్యం చేస్తున్న గవర్నర్ల చర్యను సవాలు చేస్తూ కేరళ, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశాయి. ఏడాదికి పైగా ఎనిమిది బిల్లులపై గవర్నర్లు ఆమోదం తెలపకుండా ఆపుతున్నారని, ఆలస్యానికి గల కారణం తెలియజేయట్లేదని రెండు రాష్ట్రాలూ తమ పిటిషన్‌లలో పేర్కొన్నాయి. దీంతో సుప్రీంకోర్టు గవర్నర్లకు నోటీసులు జారీ చేసింది.